సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
సోమవారం, 23.11.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:14 సంచిక: 016
పేజీలు: 08 వెల: రూ. 5

ఫేక్ ప్రచారం

2

బీఆర్ఎస్‌లో అడుగడుగునా అవమానాలే!

- నాకు క్యాన్సర్ ఉందని ప్రచారం..
- కేటీఆర్ టీమ్‌పై కవిత సంచలన ఆరోపణలు
- భర్త ఫోన్ కూడా ట్యాప్ చేశారు!
- 11 ఫోన్లు ఇచ్చా.. కేటీఆర్ ల్యాప్‌టాప్ ఎందుకివ్వలేదు?



కరీంనగర్‌లో చరిత్ర సృష్టించేలా బీజేపీ మహా పాదయాత్ర

2

ఎస్ఐఆర్‌కు మద్దతుగా నేడు భారీయాత్ర..

- హాజరుకానున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్
- దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో మహా పాదయాత్రలు
- తెలంగాణలో వచ్చేది బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వమే





అగ్నివీరులకు భారీ ఊరట


పెళ్లికి గ్రీన్ సిగ్నల్!

- రెండేళ్ల సర్వీసులో వివాహానికి అనుమతి.. కీలక నిర్ణయం
- అగ్నివీరుల పెళ్లి కల నెరవేరేలా కేంద్రం నిర్ణయం
- నాలుగు వారాల శిక్షణ తర్వాతే పెళ్లికి అనుమతి
- అగ్నిపథ్ నిబంధనల్లో కీలక మార్పు.. యువతకు భారీ ఊరట

మోడీ ఎఫెక్ట్..

బంగారం కొనద్దన్న ప్రధాని

- మోడీ మాట విని బంగారం కొనుగోళ్లు వాయిదా వేసుకున్న వాళ్లు హ్యాపీ..
- గతంలో రెండు సార్లు బంగారం కొనడం తగ్గించాలని విజ్ఞప్తి..
- ఇప్పుడు గణనీయంగా పడిపోయిన పుత్తడి ధరలు..



విద్యార్థుల కోసం..

మంత్రి దామోదరకు కేటీఆర్ ఫోన్

- హామీ ఇచ్చిన మంత్రి
- కేటీఆర్ ఫోన్‌తో దిగొచ్చిన మంత్రి దామోదర!
- రేపే సమస్యకు పరిష్కారం చూపిస్తా: మంత్రి దామోదర




ముద్ర, కరీంనగర్ :
నిత్యం విమర్శలు, ప్రతి విమర్శలతో హీటెక్కుతున్న తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదరరాజనర్సింహకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ చేశారు. కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లిలో ప్రభుత్వ వైద్య కళాశాలలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నాకు దిగిన వైద్య విద్యార్థుల సమస్యల పరిష్కారంకు కేటీఆర్ మంత్రికి ఫోన్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోన్న ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు **మిగతా 02లో**

పదవులపై భరోసా

పార్టీ నేతలకు రేవంత్ అభయహస్తం

సంక్రాంతి తర్వాత ఐదు నెలల ప్రజాబలం

- కష్టపడిన ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు
- ప్రతి గ్రామానికి కాంగ్రెస్ నేతలు
- కార్యకర్తలే పార్టీకి అసలైన బలం
- తెలంగాణకు రూ.30 వేల కోట్ల సాయం కోరుతూ తీర్మానం
- సర్‌పై కేంద్రానికి రేవంత్ సూటి ప్రశ్నలు
- ఓటు హక్కు కాపాడుకోవాలని శ్రేణులకు పిలుపు
- ఉపాధి, అభివృద్ధికి పెద్దపీట వేస్తాం
- 2027 జనగణనలో ఓబీసీ కులగణనకు డిమాండ్



ముద్ర, తెలంగాణ బ్యూరో :
తెలంగాణ కాంగ్రెస్‌లో పార్టీ పదవుల కోసం ఎదురుచూస్తున్న నాయకులు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీపి కబురు అందించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే అనేక మందికి పదవులు ఇచ్చామని గుర్తుచేస్తూనే.. రాబోయే రోజుల్లోనూ పార్టీ కోసం పనిచేసే వారికి తగిన అవకాశాలు కల్పిస్తామని సంకేతాలిచ్చారు. దీంతో చాలా కాలంగా నామినేటెడ్ పదవులు, పార్టీ బాధ్యతల కోసం ఎదురుచూస్తున్న నేతల్లో కొత్త ఆశలు చిగురించాయి.

హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి **మిగతా 02లో**

తెలంగాణ కాంగ్రెస్‌కు భారీ విజయలక్ష్యం

వచ్చే ఎన్నికల్లో మరిన్ని సీట్లు సాధించాలి

- 64 స్థానాల నుంచి మరింత ముందుకు.. కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు
- రాహుల్ ను ప్రధానిని చేయడమే లక్ష్యం..
- జోపీ, ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని తిప్పికొట్టాలి
- సమష్టి కృషితోనే అధికారంలోకి వచ్చాం.. అదే స్ఫూర్తితో పనిచేయాలి
- కాంగ్రెస్ నేతలకు దిశానిర్దేశం
- ఏఐసీసీ వ్యవహారాల నూతన ఇన్ చార్జి బీఎం సందీప్ కుమార్

ముద్ర, హైదరాబాద్:
సమిష్టిగా పని చేయడం వల్లే గత ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఏఐసీసీ వ్యవహారాల నూతన ఇన్ చార్జి బీఎం సందీప్ కుమార్ అన్నారు. గతంలో సమష్టిగా పని చేసి 64 ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకున్నామని, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లోనూ విజయాలు సాధించామని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో మరింత మెజారిటీతో ఎక్కువ స్థానాలు సాధించేలా ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీభవన్‌లో నిర్వహించిన పీఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతమైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.

దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడినప్పటికీ రాష్ట్రంలో వాటిని అధిగమిస్తూ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తగిన సహాయ సహకారాలు అందించడం లేదని విమర్శించారు. కేంద్రం సహకరించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను తీర్చేందుకు అన్ని విధాలుగా కృషి **మిగతా 02లో**



భారత్-నేపాల్ సంబంధాల బలోపేతమే లక్ష్యం

2

భారత్ లో నేపాల్ పీఎం తొలి పర్యటన

- మోడీ, ముర్ములకు బాలెన్ షా అరుదైన కానుకలు
- సంప్రదాయానికి భిన్నంగా నేపాల్ ప్రధాని గిఫ్ట్‌లు
- భారత్‌తో బంధానికి ప్రతీకగా రెండు ప్రత్యేక విగ్రహాలు



ఏకగ్రీవ పంచాయతీలకు రూ.50 లక్షల నజరానా

2

ఏకగ్రీవాలే లక్ష్యంగా చంద్రబాబు భారీ ఆఫర్

- జనాభా ప్రాతిపదికన ప్రోత్సాహకాలు..
- పంతాలు పక్కనపెట్టి ఐక్యంగా పనిచేయాలి
- పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి సత్తా చాటాలన్న ఏపీ సీఎం



టెక్నాలజీ వాడకంలో టీజీఎస్ఆర్టీసీ నయా రికార్డ్


3

డ్రైవర్ చేతిలో స్టీరింగ్.. బస్సులో ఐ-అలర్ట్ నిఘా నేత్రం!

- i-ALERT సాంకేతికతతో టీజీఎస్ ఆర్టీసీ ప్రయోగం సక్సెస్
- ఇప్పటివరకు రూ.36 కోట్ల డీజిల్ ఆదా..
- నెలకు మరో రూ.2 కోట్ల పొదుపు



ఇదీ AI ముద్ర



24న తిరుమలలో కార్తీక పర్వదీపోత్సవం

- కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీవారి ఆలయంలో నేతి వత్తులతో దీపాలంకరణ
- పౌర్ణమి గరుడసేవ, సహస్ర దీపాలంకరణ సేవ రద్దు



6

ఉగ్రదాడుల హెచ్చరిక..

పోలీసుల హైఅలర్ట్

- కాచిగూడ రైల్వే స్టేషన్, హోటల్ టూరిస్ట్ ప్లాజాకు బాంబు బెదిరింపు
- 300 మందిని చంపుతామంటూ ఉగ్రవాదుల పేరుతో బెదిరింపు మెయిల్
- రైల్వే స్టేషన్లు, హోటళ్లు, రద్దీ ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు



3

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
సోమవారం, 23 నవంబర్, 2026

40 ఏళ్ల తర్వాత నియమాలు తప్పనిసరి

40 ఏళ్లు దాటిన పురుషులు ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర పానీయాలు, అధిక ఉప్పు, కొవ్వులు, మద్యం వినియోగాన్ని తగ్గించాలి. ఇవి అనారోగ్య సమస్యల ముప్పును తగ్గిస్తాయి.



తెలంగాణ కాంగ్రెస్‌కు భారీ విజయలక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)
చేస్తోందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పనితీరు దేశంలోని ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని సందీప్ కుమార్ పేర్కొన్నారు. గతంలో రాష్ట్రంలో పార్టీ ఇన్‌చార్జులుగా పనిచేసిన ఏఐసీసీ నేతలు పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. వారి కృషిని కొనసాగిస్తూ నాయకులు, కార్యకర్తలు మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు పార్టీ శ్రేణులు మరింత కష్టపడాలని పిలుపునిచ్చారు. సోనియాగాంధీ రచించిన 'బిలాంగింగ్' పుస్తకానికి దేశవ్యాప్తంగా ప్రాధాన్యత లభించిందని పేర్కొన్నారు. సోనియా చేసిన త్యాగాలు, మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల బలిదానాలు దేశ ప్రజల మనసుల్లో నిలిచిపోయాయని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని రాజకీయంగా తిప్పికొట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేలా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సందీప్ కుమార్ పిలుపునిచ్చారు.

ఫేక్ ప్రచారం

ముద్ర, హైదరాబాద్ :
తనకు క్యాన్సర్ ఉందని, త్వరలోనే చనిపోతానంటూ 2019లో బీఆర్ఎస్ సోషల్ మీడియా వేదికగా తనపై తప్పుడు ప్రచారం చేయించారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక వ్యక్తిగతంగా టార్గెట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్ ఆధ్వర్యంలో నడిచిన బీఆర్ఎస్ సోషల్ మీడియా తనపై అసభ్యకరమైన వ్యాఖ్యలు, నిరాధార ప్రచారాలు చేయించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కవిత బీఆర్ఎస్‌లో తనకు ఎదురైన అవమానాలు, వివక్షపై పలు కీలక విషయాలు వెల్లడించారు. తన గురించి తెలియని వ్యక్తులు ఇలాంటి ప్రచారం చేస్తే పట్టించుకోవాల్సిన అవసరం లేదని, కానీ తన గురించి పూర్తిగా తెలిసిన వారే ఇలా చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ కూతురిగా, కేటీఆర్ సోదరిగా ఉన్న తనపైనే ఒక మహిళపై ఎవరూ చేయనంత అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయించారని మండిపడ్డారు. వారి మానసిక పరిస్థితి ఏంటో ప్రజలే అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు.

తనపై కోపంతో పార్టీ కార్యకర్తలను కూడా ఇబ్బందులకు గురిచేశారని కవిత ఆరోపించారు. తన దగ్గరకు వచ్చి మాట్లాడినా, తనతో ఫొటోలు దిగినా కార్యకర్తలను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని చెప్పారు. 2014 నుంచి తన పట్ల ఇదే తరహా వివక్ష కొనసాగిందని వెల్లడించారు. నిజామాబాద్‌లోని బోధన్ షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని కేసీఆర్‌ను ఎన్నోసార్లు కోరినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను తీసుకెళ్లి ఫ్యాక్టరీని ప్రారంభించాలని విజ్ఞప్తి చేసినా స్పందన లేదన్నారు. తన నియోజకవర్గానికి సంబంధించిన పనుల విషయంలోనూ వివక్ష చూపించారని, సీఎం రిలీఫ్ ఫండ్ కోసం తన పేరు మీద లేఖ పంపిస్తే లక్షల రూపాయల ఖర్చుతో వచ్చే సాయం కేవలం రూ.60 వేలు మాత్రమేనని కవిత వ్యాఖ్యానించారు. కొన్ని విషయాలు చెప్పుకుంటే చిల్లరగా ఉంటాయని కానీ ఇప్పుడు చెప్పుకునే టైమ్ వచ్చిందన్నారు.

రాజకీయాల్లో ఉన్న తన ఫోన్ ట్యాప్ చేసినా అర్థం చేసుకోగలనని, కానీ రాజకీయాలతో సంబంధం లేని తన భర్త ఫోన్‌ను కూడా ట్యాప్ చేయడం బాధించిందని అన్నారు. తనను కేవలం కేసీఆర్ బిడ్డగా కాకుండా ఒక రాజకీయ నాయకురాలిగా చూడాలని కవిత కోరారు. 2007లోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి వ్యతిరేకంగా బతుకమ్మను ఎత్తుకొని ఉద్యమాలు చేశానని గుర్తుచేశారు. లిక్కర్ స్కామ్ కేసులో తనపై ఆరోపణలు వచ్చినప్పుడు తాను ఉపయోగించిన 11 సెల్‌ఫోన్లను బహిరంగంగా చూపించి దర్యాప్తు సంస్థలకు అప్పగించానని కవిత గుర్తు చేశారు. తన పదేళ్ల రాజకీయ జీవితంలో ఉపయోగించిన ఫోన్లన్నింటినీ ఇచ్చానని, దర్యాప్తు సంస్థలు అడగకపోయినా పారదర్శకంగా వ్యవహరించానని చెప్పారు. అయితే కేటీఆర్‌ను ల్యాప్‌టాప్ ఇవ్వాలని అడిగితే ఆయన కోర్టుకు వెళ్లారని ఆరోపించారు. ల్యాప్‌టాప్ ఇవ్వకుండా ఎందుకు దాచిపెట్టారని కేటీఆర్‌ను ప్రశ్నించాలని అన్నారు.



(మొదటి పేజీ తరువాయి)
తీసుకెళ్లడం లక్ష్యంగా సంక్రాంతి తర్వాత ఐదు నెలల పాటు 'ప్రజా బలం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామానికి వెళ్లాలని ఆదేశించారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వ పనితీరును వివరించాలని, పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

అభిష్టానం నిర్ణయమే శిరోధార్యం!
తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ వంద శాతం కాంగ్రెస్ కార్యకర్తనేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానం ఏం చెబితే అది తూచా తప్పకుండా పాటిస్తానని ప్రకటించారు. పార్టీ కోసం సమష్టిగా పనిచేయడమే విజయానికి మార్గమని నేతలకు సూచించారు. కొత్తగా తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన బీఎం సందీప్ కుమార్‌కు స్వాగతం పలికారు. ఆయన నియామకానికి సహకరించిన సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీలకు ధన్యవాదాలు తెలిపారు. గతంలో మీనాక్షి నటరాజన్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న సమయంలో పార్టీ సాధించిన విజయాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉపఎన్నికలతో పాటు పంచాయతీ ఎన్నికల్లో 66 శాతం, మున్సిపల్ ఎన్నికల్లో 85 శాతం విజయాలు సాధించామని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరికీ పని..
రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం వెల్లడించారు. ప్రజలకు పని కల్పించేలా భారీ కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించడంతో పాటు ప్రజలకు ఉపాధి, అభివృద్ధి ఫలాలు అందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించిందని వివరించారు.

సర్ పై సమరం..
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపై రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. గతంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఉపయోగించిన ప్రక్రియను ఇప్పుడు ఓట్లు తొలగించేందుకు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా సుమారు 20 కోట్ల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని, ఇప్పటికే 13 కోట్ల ఓట్లు తొలగించారని వ్యాఖ్యానించారు. తెలంగాణలోనూ 71 లక్షల ఓట్లను పక్కన పెట్టారని ఆరోపించారు. పలసల పేరుతో కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండే దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, మహిళల ఓట్లను యాంత్రికంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులను తయారు చేయాలని చూస్తోందని విమర్శించారు. బ్రిటిష్ పాలనలో వినిపించిన 'సైమన్ గో బ్యాక్' నినాదం తరహాలోనే ఇప్పుడు 'జ్ఞానేష్ కుమార్ గో బ్యాక్' నినాదంతో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి అధికారులు (BLO లు), పార్టీ కార్యకర్తలు ఓటర్ల జాబితాలపై నిఘా పెట్టి అర్హులైన వారి ఓటు హక్కును కాపాడాలని సూచించారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. 30 వేల కోట్ల సాయం
మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా కరవు పరిస్థితులు నెలకొంటున్నాయని రేవంత్ రెడ్డి తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక సహా పలు ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. రాబోయే 8 నెలల పాటు రాష్ట్ర ప్రజలకు తాగునీరు అందించాల్సిన అవసరం ఉందని, అందువల్ల ప్రాజెక్టుల్లోని నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకే వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పీఏసీ సమావేశంలో తీర్మానం చేశారు. అంతేకాకుండా 2027 జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాయాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు సూచించారు. మొత్తంగా గాంధీభవన్ వేదికగా జరిగిన పీఏసీ సమావేశం తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త దిశానిర్దేశం చేసింది. ఒకవైపు పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు, గుర్తింపు కల్పిస్తామన్న భరోసా.. మరోవైపు ఐదు నెలల 'ప్రజా బలం' కార్యక్రమంతో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే వ్యూహాన్ని సీఎం ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొనగా.. రాబోయే రోజుల్లో పార్టీ పదవుల భర్తీపై ఎలాంటి నిర్ణయాలు వెలువడతాయన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది.

పదవులపై భరోసా

మోడీ ఎఫెక్ట్..

ముద్ర, తెలంగాణ బ్యూరో:
బంగారం ధరలు భారీగా పడిపోతున్నాయి. కొన్ని నెలల క్రితం పసిడి ధరలు ఆకాశాన్ని అంటాయి. ఈ ఏడాది ప్రధాని మోడీ బంగారం కొనుగోళ్లకు సంబంధించి ప్రజలకు రెండు సార్లు కీలక విజ్ఞప్తి చేశారు. అత్యవసరమైతే తప్ప ఏడాది పాటు బంగారం కొనుగోలు చేయవద్దని సూచించారు. తొలుత మే నెలలో, ఆ తర్వాత సెప్టెంబర్‌లో ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. అప్పట్లో ఆకాశాన్ని అంటిన ధరలు, ఇప్పుడు నేల చూపులు చూస్తున్నాయి. ప్రధాని సలహాపై బంగారం కొనుగోళ్లను నిలిపేసిన వారు ఇప్పుడు ధరలు తగ్గడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (MCX), దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు వరుసగా తగ్గుతున్నాయి. సుమారు పది నెలల క్రితం నమోదైన ధరలతో పోలిస్తే మార్కెట్‌లో భారీ మార్పులు కనిపిస్తున్నాయి. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో ఒక దశలో వెండి ధర రూ. 4 లక్షలు దాటగా, బంగారం ధర రూ.2 లక్షలకు చేరువైంది.

తాజాగా ప్రధాని ఏమన్నారు.?
శనివారం లక్నోలో జరిగిన కౌశల్ స్నాతకోత్సవ కార్యక్రమంలో ప్రధాన నరేంద్ర మోడీ ''బంగారం కొనుగోళ్లు వద్దు' అని చెప్పిన విషయాన్ని మరోసారి ప్రస్తావించారు. సుమారు ఏడాది క్రితం అవసరమైతేనే బంగారం కొనాలని దేశ ప్రజలకు చెప్పానని, అప్పట్లో చాలా మంది తన వ్యాఖ్యల్ని ఎగతాళి చేశారన్నారు. ఇప్పుడు తన సలహా పాటించడం వల్ల డబ్బు ఆదా అయిందని ప్రజలు చెబుతున్నారన్నారు. ఏడాది పాటు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలన్న ప్రధాని విజ్ఞప్తిపై వ్యాపారుల సంఘం ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (CTI) స్పందించింది. ప్రధానమంత్రికి ధన్యవాదాలు తెలిపింది. ప్రధాని సూచన తర్వాత ధరలు గణనీయంగా తగ్గాయని వ్యాపార సంఘం చైర్మన్ బ్రిజేష్ గోయల్ అన్నారు.

అప్పటికీ ఇప్పటికీ ఎంత తగ్గింది.?
పది నెలల క్రితం ధరలతో పోలిస్తే ఇప్పుడు బంగారం ధరలు గణనీయంగా పడిపోయాయి. మే 11న 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,50,362గా ఉంది. గత శుక్రవారం నాటికి ఈ ధర రూ.1,23,893కు పడిపోయింది. మే నెలతో పోలిస్తే 10 గ్రాముల బంగారంపై రూ. 26,469 తగ్గుదల నమోదైంది. ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మే 11న మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (MCX)లో 10 గ్రాముల బంగారం ధర రూ.1,62,835గా నమోదైంది. గత శుక్రవారం నాటికి ఈ ధర రూ.1,21,949కు పడిపోయింది. ఫ్యూచర్స్ మార్కెట్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ. 40,886 మేర తగ్గింది.

మంత్రి దామోదరకు కేటీఆర్ ఫోన్..

ముద్ర, కరీంనగర్ :
నిత్యం విమర్శలు, ప్రతి విమర్శలతో హీటెక్కుతున్న తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ చేశారు. కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లిలో ప్రభుత్వ వైద్య కళాశాలలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నాకు దిగిన వైద్య విద్యార్థుల సమస్యల పరిష్కారంకు కేటీఆర్ మంత్రికి ఫోన్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోన్న ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కేటీఆర్ విద్యార్థులను గమనించి వారి వద్దకు వెళ్లారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే స్వయంగా మంత్రి దామోదర రాజనర్సింహకు ఫోన్ చేశారు.

కేటీఆర్ ఫోన్ కాల్ కు స్పందించిన మంత్రి.. కరీంనగర్ వైద్య విద్యార్థుల సమస్య తన దృష్టికి వచ్చిందని తెలిపారు. రేపు అధికారులతో మాట్లాడి సమస్యకు సరైన పరిష్కారం చూపిస్తామని ఫోన్ కాల్‌లోనే హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కేటీఆర్ మాట్లాడుతూ పార్టీ తరపున అందరం అండగా ఉంటామని విద్యార్థులకు భరోసా ఇచ్చారు.కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లిలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభమై మూడేళ్లు దాటినా ఇప్పటికీ శాశ్వత భవనాలు, వసతి గృహాల నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో నాలుగు బ్యాచ్‌లకు చెందిన పందలాది మంది వైద్య విద్యార్థులు తాత్కాలిక, అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య చదువులు కొనసాగిస్తున్నారు.

భారత్-నేపాల్ సంబంధాల బలోపేతమే లక్ష్యం

ముద్ర, న్యూఢిల్లీ:
నేపాల్ ప్రధాని బాలెన్ షా అధికారం చేపట్టాక తొలిసారిగా భారత పర్యటనకు రాబోతున్నారు. నవంబర్ 22,23 తేదీల్లో ఆయన భారత్‌లో పర్యటించబోతున్నారు. ఆదివారం ఆయన ఢిల్లీకి చేరుకుంటారు. సోమవారం ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములతో వేర్వేరుగా భేటీ కాబోతున్నారు. అయితే, రాష్ట్రపతి, ప్రధానులకు అరుదైన గిఫ్ట్‌లు తీసుకురాబోతున్నారు.

సంప్రదాయానికి భిన్నంగా బాలెన్ షా..
గతంలో నేపాల్ ప్రధానులు భారత పర్యటనకు వచ్చినప్పుడు సంప్రదాయబద్ధంగా పశుపతినాథ్ ఆలయ సమూనాలను బహుమతిగా ఇచ్చేవారు. అయితే, బాలెన్ షా మాత్రం ఈ సారి సంప్రదాయానికి భిన్నంగా భారత్-నేపాల్ దేశాల మధ్య ఉన్న శతాబ్దాల నాటి చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక బంధాన్ని ప్రతిబింబించేలా రెండు విశిష్టమైన విగ్రహాలను తీసుకువస్తున్నారు.

ప్రధాని నరేంద్ర మోడీడికి బాలెన్ షా 'రాతో మచ్చింద్రనాథ్' విగ్రహాన్ని బహుమతిగా ఇవ్వనున్నారు. ఖాట్మాండు లోయ ప్రాంతంలో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే ఈ దైవానికి భారత్‌తో విడదీయలేని సంబంధం ఉంది. నేపాల్ చరిత్ర, విశ్వాసాల ప్రకారం.. పూర్వం ఖాట్మాండు లోయ ప్రాంతం తీవ్ర కరువుతో అల్లాడుతున్న సమయంలో లిచ్ఛవి వంశపు రాజు నరేంద్ర దేశ్ ప్రస్తుతం అస్సాం ప్రాంతం నుంచి రాతో మచ్చింద్రనాథ్‌ను ఖాట్మాండుకు తీసుకువచ్చారు.

దౌత్యపరమైన ప్రాధాన్యత..
భారత్‌తో ఎన్నో ఏళ్ల సంబంధాల కారణంగా నేపాల్ ప్రధానులు అధికారం చేపట్టిన తర్వాత భారత పర్యటనకు రావడం ఆనవాయితీగా మారింది. భారత్ కూడా తన 'నైబర్‌హుడ్ ఫస్ట్' విధానానికి ప్రాధాన్యత ఇస్తోంది. అందుకే నేపాల్‌తో సంబంధాలు మరింత బలపడాలని కాంక్షిస్తోంది. బాలెన్ షా పర్యటన ద్వారా రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతమవుతాయని రెండు దేశాలు భావిస్తున్నాయి.

సరిహద్దు వివాదాలు..
భూపరివేష్టిత దేశమైన నేపాల్ వాణిజ్యం, రవాణా అవసరాల కోసం భారత్‌పై ఆధారపడుతుంది. ఇదిలా ఉంటే లిపులేఖ్, లింపియాధుర, కాలాపానీ సరిహద్దు వివాదాలు రెండు దేశాల మధ్య సంబంధాలపై ప్రభావం చూపిస్తున్నాయి. ఈ ప్రాంతాలు తమవే అని భారత్ వాదిస్తుంటే, తమ భూభాగాలు అని నేపాల్ వాదిస్తోంది. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాల్లో కొద్దిగా ఉద్రిక్తత ఏర్పడింది. నేపాల్ ప్రధాని పర్యటనకు వస్తుండటంతో వివాదాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది.

చరిత్ర సృష్టించేలా బీజేపీ మహా పాదయాత్ర

ముద్ర కరీంనగర్:
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు మద్దతుగా కరీంనగర్‌లో నిర్వహించనున్న మహా పాదయాత్ర దేశవ్యాప్తంగా చరిత్ర సృష్టించబోతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఎస్ఐఆర్‌ను అడ్డుకునే వారు దేశద్రోహులని, విదేశీ అక్రమ చొరబాటుదారులకు ఓటు హక్కు కల్పించాలని కోరుకోవడం మూర్ఖత్వమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కరీంనగర్‌లోని గురుద్వారాలో ఎంపీ లాడ్స్ నిధులతో ఏర్పాటు చేసిన 11 కేవీ సోలార్ ప్యానెల్‌ను బండి సంజయ్ ప్రారంభించారు. గతంలో గురుద్వారాకు నెలకు రూ.25 వేల వరకు విద్యుత్ బిల్లు వచ్చేదని, ఆ భారాన్ని తగ్గించేందుకు సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ ప్రజల్లో అపోహలు సృష్టిస్తోందని విమర్శించారు. అర్హులైన భారతీయులకు ఓటు హక్కు కల్పించడం, డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లను తొలగించడం, అక్రమంగా ఓటు హక్కు పొందిన విదేశీయులను గుర్తించడం ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని వివరించారు.

ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో మహా పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు బండి సంజయ్ తెలిపారు. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్‌లను ఎంపిక చేశామని చెప్పారు. ఈనెల 23న సోమవారం కరీంనగర్‌లో జరిగే పాదయాత్రకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ హాజరవుతారని వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్ తదితర నేతలు పాల్గొంటారని తెలిపారు. గాంధీ బొమ్మ నుంచి వైశ్యా భవన్, రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, శాస్త్రి రోడ్ మీదుగా కమాన్ చౌరస్తా వరకు యాత్ర సాగుతుందని వివరించారు.

సిక్కు సమాజంపై తనకు ప్రత్యేక అభిమానం ఉందని, దేశ స్వాతంత్ర్య పోరాటంలో, సరిహద్దుల రక్షణలో సిక్కుల సేవలు మరువలేనివని కొనియాడారు. తెలంగాణలో సిక్కు కుటుంబాలు ఇళ్లు, ఉపాధి, విద్యా అవకాశాల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే సిక్కు సమాజానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యువత డ్రగ్స్‌కు బానిసలు కాకుండా చైతన్యం కావాలని, ప్రధాని మోదీ చేపట్టిన 'నషా ముక్త్ భారత్' కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

అగ్నివీరులకు భారీ ఊరట

ముద్ర, తెలంగాణ బ్యూరో:
అగ్నివీరులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట నిచ్చింది. అగ్నిపథ్ పథకం కింద రెండేళ్ల సర్వీసు పొడిగింపును (సెకండ్ టూర్ ఆఫ్ డ్యూటీ) ఎంచుకునే అగ్నివీరులు వివాహం చేసుకోవడానికి అనుమతిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే, పొడిగించిన సర్వీసులో చేరిన తర్వాత నిర్వహించే సుమారు 4 వారాల ప్రత్యేక శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన తర్వాతే వారు వివాహం చేసుకోవడానికి అర్హులవుతారని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి.

2022లో ప్రారంభించిన అగ్నిపథ్ పథకం నిబంధనల ప్రకారం.. అభ్యర్థులు నియామక సమయంలో అవివాహితులై ఉండాలి. అంతే కాకుండా, మొదటి నాలుగేళ్ల సర్వీసు కాలంలో వివాహం చేసుకోవడంపై పూర్తి నిషేధం ఉంది. రెండేళ్ల పొడిగింపు కోసం దరఖాస్తు చేసుకునే సమయానికి కూడా అగ్నివీరులు అవివాహితులుగానే ఉండాలి. కానీ, స్వల్ప విరామం తర్వాత రెండో విడత సర్వీసులో చేరి, 4 వారాల ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకున్న వెంటనే వివాహం చేసుకోవడానికి వారికి అనుమతి లభిస్తుంది.

శిక్షణ పొందిన సైనికులను కొంత కాలం సేవల్లో కొనసాగించడంతో పాటు, మిగిలిన 75 శాతం మంది అగ్నివీరులకు ఆరేళ్ల సర్వీసు తర్వాత శాశ్వత నియామకానికి మరో అవకాశం కల్పించే ఉద్దేశంతో కేంద్ర మంత్రి వర్గం నవంబర్ 4న ఈ రెండేళ్ల 'సెకండ్ టూర్ ఆఫ్ డ్యూటీ'కి ఆమోదం తెలిపింది. 17.5 నుంచి 21 ఏళ్ల వయస్సులో విధుల్లో చేరే గ్రామీణ యువత, ఐదో ఏడాదికి వచ్చేసరికి 23-24 ఏళ్లకు చేరుకుంటారు.

ఏకగ్రీవ పంచాయతీలకు రూ.50 లక్షల నజరానా

ముద్ర, అమరావతి :
స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, రానున్న పంచాయతీ ఎన్నికలు, ఏకగ్రీవాలపై సీఎం చంద్రబాబు మంత్రులు, టీడీపీ ముఖ్యనేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు, ప్రజాప్రతినిధులకు ఆయన కీలక దిశానిర్దేశం చేశారు.

ప్రజాభిప్రాయానికి అద్దం పట్టిన ఎన్నికలు
పురపాలక, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి సాధించిన ఘనవిజయం తమ రెండున్నరేళ్ల పాలనకు దక్కిన గుర్తింపు అని చంద్రబాబు అన్నారు. పార్టీ గుర్తులపై జరిగిన ఈ ఎన్నికల్లో ప్రజలు అత్యంత స్పష్ట మైన తీర్పు ఇచ్చారని, ఈ ఫలితాలు ప్రజాభిప్రాయానికి అద్దం పట్టాయని పేర్కొన్నారు. ఏక పక్షంగా వచ్చిన ప్రజాతీర్పును గొడ్డలి పార్టీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు.

ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకాలు
గ్రామాభివృద్ధికి దోహదపడేలా పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలను విస్తృతంగా ప్రోత్సహించాలని మంత్రులు, నేతలకు సీఎం సూచించారు. ఏకగ్రీవమయ్యే పంచాయతీలకు ప్రభుత్వం అందిస్తున్న భారీ ప్రోత్సాహకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. జనాభా ప్రాతిపదికన పెంచిన నజరానా వివరాలను తెలియజేశారు.

5 వేల లోపు జనాభా- రూ. 15 లక్షలు
5 వేల నుండి 10 వేల మధ్య జనాభా- రూ. 25 లక్షలు
10 వేలకు పైగా జనాభా- రూ. 50 లక్షలు
గతంలో ఏకగ్రీవ పంచాయతీలకు కనిష్టంగా రూ. 5 లక్షలుగా ఉన్న నజరానాను ఇప్పుడు రూ. 15 లక్షలకు, గరిష్టంగా రూ. 20 లక్షలుగా ఉన్న ప్రోత్సాహకాన్ని రూ. 50 లక్షలకు పెంచిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు.

పంతాలు వీడి ఐక్యంగా
పార్టీలో నేతల మధ్య వ్యక్తిగత పంతాలు, ఈగోలు ఉండటం ఏమాత్రం సరికాదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక నాయకులంతా విభేదాలను పక్కనపెట్టి, సమన్వయంతో ఐక్యంగా పనిచేసి పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. 'ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు ఎప్పుడూ అండగా ఉంటారని స్థానిక సంస్థల ఫలితాలు మరోసారి నిరూపించాయి. పదేళ్లలో ఏపీ నెంబర్ వన్ రాష్ట్రం అవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పుడు రాష్ట్రం నిలదొక్కుకుని నడుస్తోంది.. ముున్ముందు అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తాం. రాష్ట్రంలో రూ. 35 వేల కోట్ల రూపాయలతో 36 సాగునీటి ప్రాజెక్టులు చేపడుతున్నాం. రాబోయే మూడు సంవత్సరాల్లో అన్ని ప్రాజెక్టులను కంప్లీట్ చేసి చూపిస్తాం. దానికి టైమ్ బౌండ్ ప్రోగ్రాం పెట్టుకున్నాం. రాజకీయ పార్టీలు ప్రజల కోసం పనిచేయాలి. వ్యక్తిగత వివాదాల కోసం కాదు. ప్రజా జీవితంలో హుందాతనం ఉండాలి. విలువలత

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 23.11.2026
www.mudranews.in | @mudranews


60 ఏళ్ల తర్వాత ప్రోటీన్ తప్పనిసరి

వయసు పెరిగేకొద్దీ కండరాల బలం తగ్గే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా 60 ఏళ్లు దాటిన వారు ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. రోజుకు 55 నుంచి 60 గ్రాముల ప్రోటీన్‌ను వివిధ భోజనాల్లో భాగంగా తీసుకోవడం మంచిది.



హైదరాబాద్‌లో ఉగ్రదాడుల హెచ్చరిక.. పోలీసుల హై అలర్ట్!

కాచిగూడ రైల్వే స్టేషన్, హోటల్ టూరిస్ట్ ప్లాజా లక్ష్యంగా బెదిరింపు



ముద్ర, హైదరాబాద్ : హైదరాబాద్ లో 26/11 ముంబై ఉగ్రదాడులను పునరావృతం చేస్తామంటూ బెదిరింపు ఈ-మెయిల్ రావడం కలకలం రేపింది. లష్కరే తోయిబా (LeT) పేరుతో వచ్చిన ఈ-మెయిల్ లో కాచిగూడలోని హోటల్ టూరిస్ట్ ప్లాజా, కాచిగూడ రైల్వే స్టేషన్ లో బాంబు పేలుళ్లు జరుపుతామని హెచ్చరించినట్లు హైదరాబాద్ పోలీస్ స్పెషల్ బ్రాంచ్ వెల్లడించింది. ఈ దాడుల్లో కనీసం 300 మందిని హతమార్చడమే లక్ష్యమని ఈ-మెయిల్ లో పేర్కొన్నట్లు అలర్ట్ లో వివరించారు. తమ నాయకుడు లతీఫ్ భట్, ఇతర సహచరులను భారత సైన్యం హతమార్చినందుకు ప్రతీకారంగా దాడులకు పాల్పడతామని బెదిరించినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. కాచిగూడ రైల్వే స్టేషన్, హోటల్ టూరిస్ట్ ప్లాజా వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, హోటళ్లు, ప్రార్థనా మందిరాలు, రద్దీ ప్రాంతాలు, ముఖ్యమైన ప్రభుత్వ సంస్థల వద్ద నిఘా పెంచాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు, నిర్లక్ష్యంగా వదిలివెళ్లిన వస్తువులు, వాహనాలు, అసాధారణ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నిరంతర పెట్రోలింగ్, బాంబు నిరోధక తనిఖీలు చేపట్టడంతో పాటు సంబంధిత భద్రతా విభాగాలతో సమన్వయం చేసుకోవాలని స్పెషల్ బ్రాంచ్ జారీ చేసిన అలర్ట్ లో పేర్కొంది.

వికారాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి
లారీ–ఆటో ఢీ.. మృతుల కుటుంబాలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రగాఢ సానుభూతి

ముద్ర, వికారాబాద్ : జిల్లాలోని బుగ్గరామేశ్వరం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. పెండ్లిమడుగు నుంచి కేరెళ్లికి వెళ్తున్న ఆటోను లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో చంద్రమ్మ, పార్వతమ్మ, సరిత, నాగేష్ మృతి చెందినట్లు గుర్తించారు. ఈ దుర్ఘటనపై తెలంగాణ శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదం జరిగిన తీరుపై స్థానిక పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, క్షతగాత్రులు ఉంటే వారు త్వరగా కోలుకోవాలని స్పీకర్ ప్రార్థించారు.

రోడ్డు ప్రమాదంలో జబర్దస్త్ టీం సభ్యులకు గాయాలు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు.. రైజింగ్ రాజు, దొరబాబుకు గాయాలు

ముద్ర, భీమవరం : పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో జబర్దస్త్ టీం సభ్యులు రైజింగ్ రాజు, దొరబాబు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. జబర్దస్త్ టీం సభ్యులు కాకినాడ నుంచి భీమవరం వైపు కారులో ప్రయాణిస్తుండగా, పాలకోడేరు సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న రైజింగ్ రాజు, దొరబాబుకు గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పంచాయతీ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వారు ఉభయగోదావరి జిల్లాలకు వచ్చినట్లు సమాచారం.

'వికసిత్ భారత్'కు యువతే భవిష్యత్తు సంరక్షకులు

గవర్నర్ అబ్దుల్ నజీర్
వినూత్న ఆలోచనలను స్టార్టప్‌లుగా మలచాలి ఉద్యోగార్థులుగా కాకుండా ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ముద్ర, పుట్టపర్తి : వికసిత్ భారత్ @ 2047 లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందిన, స్వయం సమృద్ధి కలిగిన భారతదేశ నిర్మాణానికి యువతే ప్రధాన చోదకశక్తులని, ఆవిష్కర్తలని, భవిష్యత్తు సంరక్షకులని ఆయన పేర్కొన్నారు. పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం పూర్ణచంద్ర ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థ 45వ స్నాతకోత్సవానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్నాతకోత్సవ ప్రసంగం చేశారు.

శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థ గురుకుల సంప్రదాయంలో విద్యార్థులను తీర్చిదిద్దుతూ, వారిని పరిపూర్ణ వ్యక్తులుగా రూపొందిస్తోందని గవర్నర్ ప్రశంసించారు. విద్యార్థుల్లో ఉన్నత విలువలు, సరైన దృక్పథాన్ని పెంపొందించడం ద్వారా శారీరక, మేధోపరమైన, భావోద్వేగ, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి సంస్థ కృషి చేస్తోందని అన్నారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా మిగిలిపోకూడదని గవర్నర్ సూచించారు. తమ వినూత్న ఆలోచనలను ఆచరణాత్మక స్టార్టప్ సంస్థలుగా మార్చి, విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. తద్వారా మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బంగారు పతకాలు, పట్టాలు అందుకున్న విద్యార్థులను గవర్నర్ అభినందించారు. సంస్థ ఉపకులపతి ప్రొఫెసర్ బి. రాఘవేంద్ర ప్రసాద్ వార్షిక నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్, ట్రస్టీలు ఎస్.ఎస్. నాగానంద్, డాక్టర్ వి. మోహన్, ప్రొఫెసర్ కె.బి.ఆర్. వర్మ, శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థ గౌరవ ఛాన్సలర్ కె. చక్రవర్తి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా.. ముగ్గురి అరెస్ట్

ముద్ర, హైదరాబాద్ : ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టును మల్కాజిగిరి పోలీసులు రట్టు చేశారు. ఎస్‌వోటీ ఉప్పల్ జోన్, నాచారం పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి 60.380 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ దాదాపు రూ.30 లక్షల వరకు ఉంటుందని అంచనా. గంజాయి రవాణాకు ఉపయోగించిన కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నాచారం– చిలుకానగర్ రోడ్డులో పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. కారులోని డిక్కీలో నాలుగు గోనె సంచుల్లో 60 గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. ఒడిశాలో కిలో రూ.2 వేల చొప్పున గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్, ముంబయిలో అధిక ధరకు విక్రయించేందుకు నిందితులు సిద్ధమయ్యారు. ఒక్కో ట్రిప్‌కు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు ఇస్తామని ప్రధాన నిందితుడు రాహుల్.. ఈ ముగ్గురు నిందితులకు ఆశ చూపినట్లు పోలీసులు తెలిపారు. రాహుల్ కోసం గాలింపు చేపట్టిన పోలీసులు.. గంజాయి మూలాలు, ఆర్థిక లావాదేవీలు, డెలివరీ నెట్‌వర్క్‌పై దర్యాప్తు చేస్తున్నారు.

'ఇందిరమ్మ సూక్తులు' తెలుగు పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

సోనియా గాంధీ ముందుమాటతో తెలుగు పాఠకుల ముందుకు పుస్తకం
ఇందిరా గాంధీ ఆలోచనలు, ఆశయాలను యువతకు చేరువ చేయడమే లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్



ముద్ర, హైదరాబాద్ : దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఆలోచనలు, ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని భావితరాలకు పరిచయం చేసే లక్ష్యంతో రూపొందించిన 'ఇందిరమ్మ సూక్తులు' తెలుగు పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదివారం గాంధీభవన్‌లో ఆవిష్కరించారు. కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ముందుమాటతో వెలువడిన ఈ పుస్తకాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలుగులో ప్రచురింపజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి బి.ఎం. సందీప్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు పలువురు పీఏసీ సభ్యులు పాల్గొన్నారు. ఇంగ్లిష్‌లో ప్రచురితమైన 'ఇందిరా గాంధీ సెలెక్టెడ్ సేయింగ్స్' పుస్తకాన్ని తెలుగులో 'ఇందిరమ్మ సూక్తులు' పేరుతో డాక్టర్ పొన్నం రవిచంద్ర, డాక్టర్ మామిడి హరికృష్ణ, శ్రీలక్ష్మి అనువదించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ తెలుగు పుస్తకాన్ని ప్రచురణకు తీసుకొచ్చారు. తొలుత ఈ పుస్తకాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కన్నడ భాషలో వెలువరించారు. తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఇందిరా గాంధీ ఆలోచనలు, సందేశాలు, సూక్తులను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని తెలుగులో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఇందిరా గాంధీ ఆశయాలు, ప్రజాసేవ పట్ల ఆమె కున్న నిబద్ధత, ఆలోచనా విధానాన్ని భావితరాలకు పరిచయం చేసేందుకు 'ఇందిరమ్మ సూక్తులు' పుస్తకం మంచి ప్రయత్నమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ పుస్తకానికి సోనియా గాంధీ రాసిన ముందుమాట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే లక్ష్యం

- మహేష్ కుమార్ గౌడ్

ముద్ర, హైదరాబాద్: తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. గాంధీభవన్‌కు తొలిసారి వచ్చిన నూతన ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి బి. సందీప్ కుమార్‌కు స్వాగతం పలికారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేపడుతున్న ఉద్యమాలను తెలంగాణలోనూ విస్తృతం చేస్తామని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ నెల 26న అంబేద్కర్ విగ్రహం నుంచి నెహ్రూ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని కోరారు.

ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఉత్తమ్



ముద్ర, హైదరాబాద్, నవంబర్ 22: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ పునాదులని పేర్కొన్నారు. తెలంగాణలో రికార్డు స్థాయిలో పంటల ఉత్పత్తికి గత కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే ప్రధాన ఆధారమన్నారు. భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ కాళేశ్వరం ప్రాజెక్టు ఆశించిన ప్రయోజనాలు అందించడం లేదని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడకుండా, వచ్చే వర్షాకాలం వరకు తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ విజయాలను వివరించి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు.

ఓబీసీ కులగణన, ఎల్‌నినో ప్రభావంపై కేంద్రం స్పందించాలి

ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి.. ఓట్ల తొలగింపును అడ్డుకోవాలి: సీఎం రేవంత్ రెడ్డి



ముద్ర, హైదరాబాద్ : తెలంగాణలో ఓబీసీ కులగణన నిర్వహించిన తరహాలో 2027లో కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలోనూ ఓబీసీ కులగణన చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని కోరారు. గాంధీ భవన్‌లో ఆదివారం జరిగిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో సీఎం మాట్లాడారు. నూతన ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి బీఎం సందీప్‌కు స్వాగతం పలికిన సీఎం.. ఆయన నియామకం పట్ల సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలకు ధన్యవాదాలు తెలిపారు. మీనాక్షి నటరాజన్ ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి విజయాలు సాధించిందని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో 66 శాతం, మున్సిపల్ ఎన్నికల్లో 85 శాతం విజయం సాధించామని తెలిపారు.

ఓబీసీ కులగణనపై తీర్మానం

వందేళ్ల తర్వాత తొలిసారిగా తెలంగాణలో ఓబీసీ కులగణన నిర్వహించామని సీఎం పేర్కొన్నారు. 2027లో కేంద్రం చేపట్టే జనగణనలో ఓబీసీ కులగణనను చేర్చాలని పీఏసీ సమావేశం నుంచి తీర్మానం ద్వారా కేంద్రాన్ని కోరనున్నట్లు వెల్లడించారు. ఈ అంశంపై ప్రధానమంత్రికి లేఖ రాయాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు సూచించారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు రూ.30 వేల కోట్లు అవసరం

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గుతున్నాయని, దేశంలోని సుమారు 100 దేశాలు ఇలాంటి వాతావరణ ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సీఎం అన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోనూ కరవు పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఆహార ధాన్యాలకు కొరత లేదని, వర్షాకాలంలో 20 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉన్నప్పటికీ రైతులకు సరఫరా చేసి పంటలు ఎండిపోకుండా కాపాడామని వివరించారు.

రానున్న ఎనిమిది నెలల పాటు ప్రజలకు తాగునీరు అందించాల్సి ఉందని, ప్రాజెక్టుల్లోని నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి రావచ్చని చెప్పారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూ.30 వేల కోట్లు అవసరమని, కేంద్రం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ అంశంపై కూడా పీఏసీ సమావేశంలో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు.

ప్రజాబలం కార్యక్రమానికి శ్రీకారం

ప్రతి ఒక్కరికీ పని కల్పించడమే లక్ష్యంగా త్వరలో పెద్ద కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు సీఎం వెల్లడించారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వారి సంఖ్య పెరిగిందని తెలిపారు. సంక్రాంతి తరహాలో ఐదు నెలల పాటు ప్రజాబలం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ప్రతి గ్రామానికి కాంగ్రెస్ నాయకులు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ పని కల్పించడంతో పాటు నిధుల కొరత లేకుండా చూస్తామని చెప్పారు.

మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కృషితో దేశంలో విద్య, సాగునీటి రంగాలు అభివృద్ధి చెందాయని, ఆహార ధాన్యాల ఉత్పత్తిలోనూ దేశం స్వయం సమృద్ధి సాధించిందని సీఎం పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేసిన అనేక మందికి ఇప్పటికే పదవులు కల్పించామని తెలిపారు.

టెక్నాలజీ వాడకంలో టీజీఎస్ఆర్టీసీ నయా రికార్డ్

డ్రైవర్ చేతిలో స్టీరింగ్.. బస్సులో ఐ-అలర్ట్ నిఘా నేత్రం!
i-ALERT సాంకేతికతతో టీజీఎస్ ఆర్టీసీ ప్రయోగం సక్సెస్
ఇప్పటివరకు రూ.36 కోట్ల డీజిల్ ఆదా..
నెలకు మరో రూ.2 కోట్ల పొదుపు



ముద్ర, హైదరాబాద్ : ఇంధన సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ప్రయాణికులు, సిబ్బంది భద్రతను మెరుగుపరిచేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక ముందడుగు వేసింది. తన BS-VI బస్సులలో ఆధునిక 'i-ALERT' వ్యవస్థను ప్రవేశపెట్టి, దేశంలోనే ఈ సాంకేతికతను వినియోగించిన తొలి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థగా రికార్డు సృష్టించింది. ఈ వినూత్న టెక్నాలజీ సమర్థవంతమైన వినియోగం ద్వారా సంస్థ ఇప్పటివరకు సుమారు రూ. 36 కోట్ల విలువైన హై-స్పీడ్ డీజిల్‌ను ఆదా చేయగా, ప్రతినెలా సగటున రూ. 2 కోట్ల మేర నిర్వహణ వ్యయం తగ్గుతోంది. 'i-ALERT' వ్యవస్థ బస్సుల డ్రైవింగ్ విధానాలను నిరంతరం పర్యవేక్షిస్తూ డ్రైవర్ల పనితీరును అంచనా వేస్తుంది. సరైన గేర్ల ఎంపిక, గ్రీన్ బ్యాండ్ RPM పరిధిలో డ్రైవింగ్, అనవసరంగా ఇంజిన్ ఆన్ చేసి ఉంచడం, అతివేగం , ఆకస్మిక బ్రేకుల వాడకం వంటి అంశాలను ఇది ఎప్పటికప్పుడు గమనిస్తుంది. విధి నిర్వహణ అనంతరం డ్రైవర్ నైపుణ్యాలకు గ్రేడింగ్స్ ఇస్తూ, శాస్త్రీయ , ఇంధన పొదుపు డ్రైవింగ్ పద్ధతులను అలవర్చుకునేలా తగిన మార్గదర్శకాలు అందిస్తోంది. ప్రస్తుతం 1,500 అశోక్ లేలాండ్ BS-VI బస్సులలో ఈ పరికరాలను అమర్చడం ద్వారా రోజుకు 6,603 లీటర్లు, నెలకు 1,98,090 లీటర్ల డీజిల్ ఆదా అవుతోంది. దీనివల్ల వాహన ఉద్గారాలు గణనీయంగా తగ్గి, ఏటా సుమారు 6,170 మెట్రిక్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ (CO_2) వ్యర్థాలు వాతావరణంలో కలవకుండా నివారించగలుగుతున్నారు. టీజీఎస్ ఆర్టీసీ సాధించిన ఈ విజయంపై పొరుగు రాష్ట్రాలైన ఏపీఎస్ ఆర్టీసీ, కేఎస్ ఆర్టీసీ అధికారులు ఆసక్తి కనబరుస్తూ, ఈ టెక్నాలజీ పనితీరు వివరాలను కోరారు. ఈ అద్భుత సాంకేతికతను విజయవంతంగా అమలు చేసిన ఇంజనీరింగ్ విభాగాన్ని సంస్థ వీసీ & ఎండీ డాక్టర్ అనిల్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని ప్రయాణికులకు మరింత మెరుగైన, సురక్షితమైన సేవలు అందించడమే సంస్థ ప్రధాన ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

డ్రగ్స్ రహిత భారత్ ఉద్యమానికి ప్రభాస్ మద్దతు!

టాలీవుడ్ హీరో ప్రభాస్‌ను కలిసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
'నషాముక్త్ భారత్' కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానం..
పోస్టర్ ఆవిష్కరణ



ముద్ర, హైదరాబాద్ : డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నషాముక్త్ భారత్' కార్యక్రమానికి టాలీవుడ్ అగ్ర కథానాయకుడు ప్రభాస్ మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో భాగస్వామి కావాలని కోరుతూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం ప్రభాస్ ను కలిశారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో హైదరాబాద్ లో నిర్వహించనున్న 'నషాముక్త్ భారత్' కార్యక్రమానికి హాజరుకావాలని ప్రభాస్ ను మంత్రి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇద్దరూ కలిసి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు.



డ్రగ్స్ దుష్ప్రభావాలపై యువతలో అవగాహన పెంచడంతో పాటు మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి, అక్కినేని నాగార్జున, విక్టరీ వెంకటేశ్ తో పాటు దర్శకులు సుకుమార్, బోయపాటి శ్రీనులను కూడా కిషన్ రెడ్డి కలిసి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. సినీ ప్రముఖులు, యువతకు ఆదర్శంగా నిలిచే వ్యక్తుల భాగస్వామ్యంతో డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.


సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

సోమవారం,
23 నవంబర్, 2026

4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మెయిల్: mudradaily@gmail.com



రాత్రి భోజనం..

నిద్రకు మధ్య ఎంత గ్యాప్ ఉండాలి?

గ్యాస్ట్రో వైద్యులు ఏం చెబుతున్నారంటే..

రాత్రి భోజనం చేసిన వెంటనే పడుకుంటున్నారా? ఈ అలవాటు వల్ల గుండెల్లో మంట, యాసిడ్ రిఫ్లక్స్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు రావచ్చు. మరి భోజనం చేసిన తర్వాత ఎంతసేపటికి నిద్రపోవాలి?

రాత్రి భోజనం ఆలస్యంగా చేయడం.. తిన్న వెంటనే పడుకోవడం చాలా మందికి అలవాటు. పని ఒత్తిడి, ఆలస్యంగా ఇంటికి చేరుకోవడం వంటి కారణాలతో కొందరు తొమ్మిది తర్వాత భోజనం చేస్తుంటారు. వెంటనే రిలాక్స్ అవ్వాలని పడుకుంటారు. ఇలా తిన్న వెంటనే నిద్రపోవడం రెగ్యులర్‌గా జరిగితే జీర్ణ వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం పడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. తిన్న వెంటనే నిద్రపోవడం వల్ల గుండెల్లో మంట, యాసిడ్ రిఫ్లక్స్, కడుపు ఉబ్బరం వంటి సమస్యల అవకాశం పెరుగుతుంది. మరి రాత్రి భోజనం చేసిన తర్వాత ఎంత సమయానికి నిద్రపోవాలి? ఆలస్యంగా తినడం వల్ల కలిగే ఇబ్బందులేంటో తెలుసుకుందాం.

యాసిడ్ రిఫ్లక్స్

భోజనం చేసిన వెంటనే పడుకోవడం వల్ల కడుపులోని యాసిడ్స్ తిరిగి అన్నవాహికలోకి వచ్చే అవకాశం పెరుగుతుంది. దీనినే యాసిడ్ రిఫ్లక్స్ అంటారు. దీనివల్ల గుండెల్లో మంట, గొంతులో పుల్లటి రుచి, ఛాతీలో అసౌకర్యం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ముఖ్యంగా ఇప్పటికే గ్యాస్ట్రోఈసోఫేజియల్ రిఫ్లక్స్ వ్యాధి ఉన్నవారిలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉండొచ్చు. భోజనం చేసిన వెంటనే పడుకోకుండా కొంతసేపు నిటారుగా కూర్చోవాలి లేదా నెమ్మదిగా నడవాలి. పడుకున్నప్పుడు కడుపులోని ఆమ్లాలు అన్నవాహికలోకి తిరిగి వచ్చే ప్రమాదం తగ్గించేందుకు భోజనానికి, నిద్రకు మధ్య తగిన విరామం ఇవ్వడం ముఖ్యం.

కడుపు ఉబ్బరం, అజీర్ణం

రాత్రి సమయంలో ఎక్కువ ఫుడ్ తీసుకోవడం, నూనెలో వేయించిన, మసాలా ఫుడ్స్ తినడం వల్ల కొందరిలో అజీర్ణం, కడుపు ఉబ్బరం, కడుపు బరువుగా అనిపించడం వంటి సమస్యలు రావచ్చు. అలా తిని భోజనం చేసిన వెంటనే పడుకోవడం వల్ల ఈ అసౌకర్యం మరింత ఎక్కువగా అనిపించవచ్చు. కాబట్టి రాత్రుళ్లు ఎక్కువగా, హెవీ మీల్స్ తినడం కంటే తేలికపాటి ఆహారం తీసుకోవడం మంచిది. రాత్రి భోజనంలో వేయించిన పదార్థాలు, అధిక కొవ్వు ఉన్న ఆహారాలు, మంటను పెంచే మసాలా పదార్థాలను తగ్గించాలి. ప్రతి ఒక్కరికీ ఈ ఫుడ్స్ సమస్య కలిగించకపోవచ్చు. కాబట్టి మీ శరీరాన్ని బట్టి ఏ పదార్థాలు తిన్నప్పుడు ఇబ్బందిగా ఉంటుందో గుర్తించి వాటిని కంట్రోల్ చేయాలి.

నిద్రకు ఆటంకం

రాత్రి భోజనం చేసిన తర్వాత యాసిడ్ రిఫ్లక్స్ లేదా గుండెల్లో మంట వస్తే నిద్ర మధ్యలో మెలకువ రావచ్చు. నిద్ర నాణ్యత తగ్గడంతో మరుసటి రోజు అలసట, ఏకాగ్రత లోపం వంటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. వీటివల్ల జీర్ణ సమస్యలు కూడా పెరుగుతాయి. నిద్రపోయే సమయానికి దగ్గరగా భారీ భోజనం చేయకూడదు. తరచూ రాత్రిపూట గుండెల్లో మంటతో నిద్ర లేస్తుంటే దానిని సాధారణ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

మధుమేహంపై ప్రభావం

ఒక అధ్యయనంలో 12 మందిని పరిశీలించగా.. సాయంత్రం 6 గంటలకు బదులుగా రాత్రి 11 గంటలకు భోజనం చేసినప్పుడు మరుసటి రోజు అల్పాహారం తర్వాత రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు ఎక్కువగా నమోదయ్యాయి. అయితే ఈ అధ్యయనం చాలా చిన్నది. కాబట్టి దీని ఆధారంగా ప్రతి ఒక్కరిలోనూ ఇదే ప్రభావం ఉంటుందని చెప్పలేం. కాబట్టి ప్రతిరోజూ అర్ధరాత్రి సమీపంలో భారీ భోజనం చేసే అలవాటు ఉంటే దాన్ని మార్చుకోవడం మంచిది. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు భోజన సమయాలు, ఆహార పరిమాణంపై వైద్యుడు లేదా పోషకాహార నిపుణుడి సూచనలు పాటించాలి.

బరువు పెరగవచ్చు

బరువు పెరగడంలో రోజంతా తీసుకునే మొత్తం క్యాలరీలు, శారీరక శ్రమ, నిద్ర, ఆహారపు అలవాట్లు వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి. అయితే రాత్రుళ్లు తరచుగా ఎక్కువ ఆహారం తీసుకుంటుంటే.. కేలరీల మోతాదు పెరిగే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలంలో ఇలాంటి అలవాట్లు జీవక్రియల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. బరువు తగ్గేందుకు రాత్రి భోజనం మానేయాల్సిన అవసరం లేదు. బదులుగా సమతుల్య ఆహారం తీసుకోవాలి. కూరగాయలు, తగిన ప్రోటీన్, ధాన్యాలు ఉండేలా భోజనం చేసుకోవాలి. భోజనం చేసిన సమయం ఒక్కటే బరువు పెరుగుదలను నిర్ణయించదని గుర్తించాలి.

ఎప్పుడు నిద్రపోవాలి?

సాధారణంగా రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రపోవడానికి కనీసం రెండు నుంచి మూడు గంటల విరామం ఇవ్వడం మంచిది. ఈ సమయంలో కడుపులోని ఆహారం కొంత వరకు ముందుకు కదిలేందుకు సమయం లభిస్తుంది. అలాగే పడుకున్నప్పుడు యాసిడ్స్ అన్నవాహికలోకి తిరిగి వచ్చే ప్రమాదం తగ్గవచ్చు. తరచుగా యాసిడ్ రిఫ్లక్స్ సమస్యతో బాధపడేవారు తమ లక్షణాలను బట్టి వైద్య సహాయం తీసుకోవాలి.

వీలైనంత వరకు ప్రతి రోజూ ఒకే సమయానికి రాత్రి భోజనం చేయడానికి ప్రయత్నించాలి. నిద్రపోయే సమయానికి అనుగుణంగా భోజన సమయాన్ని ముందుగా ప్లాన్ చేసుకోవాలి. పని కారణంగా ఆలస్యమైతే తేలికపాటి ఆహారం తీసుకోవాలి.

మీరు అమూల్యమైనవారు

ఏం చేయాలో నిర్ణయించుకోవటం ఎంత ముఖ్యమో, చేయకూడదో నిర్ణయించుకోవటం అంతే ముఖ్యం



శ్రావస్తి నగరంలో గౌతమ బుద్ధుడు తన అనుచరులతో ఉన్నాడు. అదే నగరంలో ఒక పేదవాడు చినిగిన బట్టలు ధరించి అర్థాకలితో గడిపేవాడు. అతడిని చూసి ఆ నగర ప్రజలు చులకనగా చూసేవారు. అతడు ఏ వీధి గుండా వెళ్తున్నా 'హేళన' చేస్తూ అవమానించేవారు. కానీ అతడు మాత్రం ఎవరినీ ఏమనేవాడు కాదు. క్రమ క్రమంగా ఆ పేదవాడిలో ఓ భావన నాటుకొని పోయింది. అదేమిటంటే నిజంగా తను ఓ పనికిరాని విలువ తక్కువ వ్యక్తినేమో అని. ఒకరోజు దుఃఖంతో కూడిన మనసుతో గౌతమ బుద్ధుడి వద్దకు చేరుతాడు. ధ్యానంలో ఉన్న బుద్ధుడి పాదాలను తాకి 'హే బుద్ధా ఈ ప్రపంచంలో మనిషి యొక్క విలువ దేని ఆధారంగా నిర్ణయించబడుతుంది. నా వద్ద ధనము గాని, పదవి గాని లేవు. అలాగే నన్ను ఎవరూ గౌరవించడం లేదు. అలాగని నా జీవితం వ్యర్థమైనదా' అని అడుగుతాడు. అతడి మాటలు విన్న బుద్ధుడు నవ్వి తనకు దగ్గరలో ఉన్న ఓ చిన్న రాయిని చేతిలోకి తీసుకొని ఆ పేదవాడి చేతిలో పెట్టి ఈ రాయిని నగరంలోని ఓ బజారులోకి తీసుకొని వెళ్ళమని చెప్తాడు. దీనిని చూసి ఎవరైనా దీని "విలువ" లేదా 'ఖరీదు' చేయాలని చూస్తే అమ్మొద్దని. అలాగే వారికి రెండు వేళ్ళు చూయించి 'తిరిగి తన వద్దకు రమ్మని" అంటాడు.

బుద్ధుడు చెప్పిన ప్రకారం ఆ రాయిని తీసుకొని బజారుకి వెళ్తాడు. బజారులో ఓ కూరగాయలు అమ్మే వ్యక్తి రాయిని చూసి ఈ రాయి దేనికోసం, ఎందుకు ఉపయోగపడుతుంది అని అడుగుతాడు. ఆ ఆ ప్రశ్నకు ఆ పేదవాడు బుద్ధుడు చెప్పిన ప్రకారం రెండు వేళ్ళు చూయించి అక్కడి నుండి కదిలాడు. ఐనా ఆ కూరగాయల వ్యాపారి 'రాయి' ఉన్న పేదవాడిని పిలుస్తూ రెండు కిలోల కూరగాయలు ఇస్తాను. ఆ రాయి తనకు ఇవ్వమని అడుగుతాడు. ఐనా పేదవాడు ఆ రాయి ఇవ్వకుండా తిరిగి బుద్ధుడి వద్దకు చేరుతాడు.

ఆ పేదవాడిని ఉద్దేశించి బుద్ధుడు ఇప్పుడు ఆ రాయిని ఓ కంసలి

వద్దకు తీసుకొని వెళ్ళమంటాడు. నేను ఇంతకు ముందు ఏదైతే (రెండు వేళ్ళు చూయించే లా) చెప్పానో అలాగే చేయ మంటాడు. బుద్ధుడు చెప్పిన ప్రకారం పేదవాడు 'కంసలి' వద్దకు వెళ్తాడు. ఆ రాయిని చూసి శ్రద్ధగా పరీక్షిస్తాడు. 'ధర' ఎంత అని అడుగుతాడు. అప్పుడు మళ్ళీ రెండు వేళ్ళు చూయి స్తాడు. ఆ సంజ్ఞలకు కంసలి ఆశ్చర్యంతో రెండు బంగారు నాణేలు ఇస్తాను ఈ రాయికి బదులుగా. ఇది చాలా విలువైన ది. నాకు ఇవ్వమని అడుగుతాడు. ఆ మాటలు విన్న పేదవా డు విస్మయంతో మళ్ళీ గౌతమ బుద్ధుడి వద్దకు వస్తాడు. అంతిమంగా బుద్ధుడు ఆ పేదవాడిలో ఈ రాయిని చివరగా రాజమందిరానికి తీసుకొని వెళ్ళు అంటాడు. బుద్ధుడి సలహా ప్రకారం రాయిని తీసుకొని రాజమందిరానికి వెళ్తాడు. అక్క డ రత్నాలను పరీక్షించే వ్యక్తి రాయిని చూసి ఆశ్చర్యంగా తల వంచి ఆ పేదవాడితో ఇలా ఈ 'రాయి' అత్యంత అరుదుగా లభించే 'జాతిరత్నం'. దీని ధరను నిర్ణయించటం చాలా కష్టం. దీనిని ఎవరు కొనుగోలు చేయలేరు అంటాడు. అతడి మాటలు విన్న పేదవాడికి 'జ్ఞానోదయం' కలిగింది. అక్కడి నుండి తిరిగి మళ్ళీ గౌతమ బుద్ధుడి వద్దకు వచ్చి పాదాలను తాకి అక్కడే కూర్చుంటాడు.

అప్పుడు బుద్ధుడు మిత్రమా మనిషి యొక్క 'విలువను' దేని ఆధారంగాను నిర్ణయించలేము. సింహాసనంపై కూర్చున్న వ్యక్తిని ఆ రాజ్యం మొత్తం గౌరవిస్తుంది. అదే వ్యక్తి రాజ్యం కోల్పోతే బానిసలా చూస్తుంది. విలువ మనిషి నిలబడిన చోటు నుండి లేదా చేసే పనిని బట్టి నిర్ణయించబడుతుంది. అంతేకాని మనిషి / వ్యక్తి ఎల్లప్పుడు తనకు తానుగా ఏ పరిస్థితులలో ఉన్నా ఎలాంటి సందర్భంలో ఉన్నా సర్వోన్నతుడిగా భావించాలి. సింహాసనం మీద కూర్చున్న రాజుకి అతడి విలువ ఆ దేశ ప్రజలు, సైన్యం ఆధారంగా లభిస్తున్నవే. ఎలాగంటే నీటిలో ఉన్న మొసలి బయటికి వస్తే దాని విలువను. అదే విధముగా కొలనులో ఉన్న చేప ఒడ్డున పడితే దాని విలువను కోల్పోతుంది. అలాగే మనిషి కూడా తన విలువను తను చేసే చెడ్డ పనుల వల్ల కోల్పోతాడు అంటాడు. ఆ మాటలు విన్న ఆ పేదవాడు అక్కడి నుండి వెళ్ళి తన అలవాట్లను మార్చు కొని విలువైన సమయాన్ని దుర్వినియోగం చేయకుండా దొరికిన పని చేసుకొని గౌరవంగా బతకటం ప్రారంభిస్తాడు.



డా.ముహ్మద్ హసన్
సెల్: 9908059234

ప్రతిబింబించే అద్దమా?

ఆత్మన్యూనతను పెంచే మాయా ప్రపంచమా?

ఓటమిని చూసి భయపడకు, అది విజయం వైపు మొదటి అడుగు.
ప్రతి తప్పు ఒక పాఠం, దాని నుండి నేర్చుకో.
కృషి చేయకుంటే ఫలితం రాదు, పట్టుదలే నీ ఆయుధం.
నీ విజయం నీ చేతుల్లోనే ఉంది.

క్రమశిక్షణ నీకు మంచి భవిష్యత్తును ఇస్తుంది.
నిరంతరం నేర్చుకోవడం కొనసాగించు, జ్ఞానం అంతం లేనిది.
సమయాన్ని బాగా వినియోగించు, స్మార్ట్ గా చదువు.
ఉన్నతమైన లక్ష్యాల కోసం ఆశించు.

- స్నేహితులను ఎంపిక చేసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండు.
- మంచి స్నేహితులు నీకు తోడుగా ఉంటారు, చెడు స్నేహితులు నీకు ఆటంకం.
- సలహాలు తీసుకో, కానీ నీ నిర్ణయం నీదే.
- నీ భవిష్యత్తును నువ్వే నిర్ణయించుకో.

ప్రతి రోజు కొత్తగా నేర్చుకో, కొత్త ఆలోచనలను స్వాగతించు.
పాండిత్యం పెంచుకో, జీవితాన్ని అర్థం చేసుకో.
విమర్శలను స్వీకరించు, లోపాలను సరిదిద్దుకో.
మెరుగైన వ్యక్తిగా రూపొందు.

ఆరోగ్యం ముఖ్యం, చదువుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకో.
సరైన ఆహారం, తగినంత నిద్ర, వ్యాయామం.
మానసిక ప్రశాంతతను పొందడానికి ధ్యానం చెయ్యి.
శారీరక, మానసిక ఆరోగ్యం విజయంలో కీలక పాత్ర పోషిస్తాయి.

పరీక్షలంటే భయపడకు, వాటిని సవాలుగా స్వీకరించు.
మంచిగా ప్రిపేర్ అవ్వు, ఆత్మవిశ్వాసంతో రాయి.
ఫలితం గురించి చింతించకు, నీ కృషిపై దృష్టి కేంద్రీకరించు.

ఇన్‌స్టాగ్రామ్ మోజులో మసకబారుతున్న మానసిక ప్రశాంతత.. వాస్తవ జీవితానికి దూరమవుతున్న యువత!

మన జేబులో ఉన్న అద్దం ప్రతిరోజూ ఉదయం మనతో.. 'నువ్వు అందంగా లేవు.. నీ జీవితం గొప్పగా లేదు.. అందరూ సంతోషంగా ఉన్నారు.. నువ్వు మాత్రం వెనుకబడిపోయావు' అని చెబితే దానిని వెంటనే పక్కన పడేస్తాం. కానీ విచిత్రమేమిటంటే, మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే ఒక డిజిటల్ అద్దాన్ని మాత్రం ప్రతిరోజూ గంటల తరబడి చూస్తున్నాం. అదే ఇన్‌స్టాగ్రామ్! ఇతరుల అందమైన ఫొటోలు, విదేశీ పర్యటనలు, విలాసవంతమైన జీవనశైలి, విజయాలు చూస్తూ చాలామంది తమ జీవితాలను వారితో పోల్చుకుంటున్నారు. ఫలితంగా తమ జీవితంలో ఏదో లోటు ఉందనే భావన, అసంతృప్తి, ఆందోళన పెరుగుతున్నాయి. వినోదం కోసం ప్రారంభమైన సోషల్ మీడియా వినియోగం క్రమంగా మానసిక ప్రశాంతతకు సవాలుగా మారుతోంది.

సోషల్ మీడియా.. పోలికల ప్రపంచం!

జీన్ ట్వెంజ్, జోనాథన్ హైట్ వంటి పరిశోధకులు స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం యువత మానసిక ఆరోగ్యంపై చూపుతున్న ప్రభావాలను అధ్యయనం చేశారు. 2021లో వెలుగులోకి వచ్చిన మెటా సంస్థ అంతర్గత పరిశోధనలో, తమ శరీరాకృతి పట్ల అసంతృప్తిగా ఉన్న టీనేజ్ అమ్మాయిలలో 32 శాతం మందికి ఇన్‌స్టాగ్రామ్ ఆ అసంతృప్తిని మరింత పెంచినట్లు వెల్లడైంది. సోషల్ మీడియానే అన్ని మానసిక సమస్యలకు కారణం కాకపోయినా, అధిక వినియోగం, ఇతరులతో పోల్చుకోవడం ప్రతికూల ప్రభావాలను కలిగించవచ్చు.

మనసును ప్రభావితం చేసేవి..

పోల్చుకోవడం
— ఆత్మన్యూనతకు ఆరంభం

మన జీవితంలోని కష్టాలు మనకు పూర్తిగా తెలుసు. కానీ ఇతరుల జీవితాల్లో వారు చూపించాలనుకున్న అందమైన క్షణాలు మాత్రమే మనకు కనిపిస్తాయి. ఈ రెండింటినీ పోల్చుకోవడం వల్ల మన జీవితంపై అసంతృప్తి, ఆత్మన్యూనత పెరిగే అవకాశం ఉంది.

డోపమైన్ ఉచ్చు
— అంతులేని స్క్రోలింగ్:

ఒక రీల్ తర్వాత మరొక రీల్.. ఎప్పుడు ఆసక్తికరమైన వీడియో వస్తుందో, ఎప్పుడు కొత్త నోటిఫికేషన్ వస్తుందో అనే ఆసక్తి మనల్ని నిరంతరం ఫోన్‌కు కట్టిపడేస్తుంది. కొద్దిసేపు చూడాలనుకున్నా గంటల తరబడి సమయం గడిచిపోతుంది.

ఫోమో
— ఏదో కోల్పోతున్నామనే భయం:

స్నేహితుల విహారయాత్రలు, వేడుకలు, విజయాలు చూసినప్పుడు మనం ఏదో గొప్ప అనుభవాన్ని కోల్పోతున్నామనే భావన కలుగుతుంది. దీనినే 'ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్' (FOMO) అంటారు. ఇది మన దగ్గర ఉన్న ఆనందాన్ని కూడా ఆస్వాదించనివ్వదు.

సమయ నష్టం
— నిజ జీవితానికి దూరం:

సోషల్ మీడియాలో గంటల తరబడి గడపడం వల్ల పుస్తక పఠనం, వ్యాయామం, కుటుంబ సభ్యులతో సంభాషణ, నిద్ర, కొత్త నైపుణ్యాల అభ్యాసం వంటి విలువైన పనులకు సమయం తగ్గిపోతుంది. డిజిటల్ ప్రపంచంలో పెరిగే పరిచయాలు నిజ జీవితంలోని ఆత్మీయ సంబంధాలకు ప్రత్యామ్నాయం కాలేవు.

ఉచ్చు నుంచి బయటపడటం ఎలా?

టెక్నాలజీని పూర్తిగా వదిలేయడం పరిష్కారం కాదు. దానిని మన అవసరాలకు అనుగుణంగా, మన నియంత్రణలో ఉపయోగించుకోవాలి. అవసరం లేని నోటిఫికేషన్లను నిలిపివేయాలి. నిద్రకు ముందు కనీసం గంటసేపు ఫోన్‌కు దూరంగా ఉండాలి. మనలో అసూయ, అసంతృప్తి కలిగించే ఖాతాలను అన్‌ఫాలో చేయాలి. సోషల్ మీడియా వినియోగానికి పరిమితి విధించుకోవాలి.

అన్నింటికంటే ముఖ్యంగా కుటుంబ సభ్యులతో సమయం గడపడం, స్నేహితులను ప్రత్యక్షంగా కలవడం, పుస్తకాలు చదవడం, వ్యాయామం చేయడం వంటి అలవాట్లకు ప్రాధాన్యత ఇవ్వాలి. సోషల్ మీడియాను కేవలం వినోదానికి కాకుండా విజ్ఞానం, నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంపొందించుకునే వేదికగా మార్చుకోవాలి.

లైకుల సంఖ్య కాదు!

మనిషి విలువను నిర్ణయించేది అతని వ్యక్తిత్వం, ఆలోచనలు, నైపుణ్యాలు, మానవసంబంధాలు, సాధించిన విజయాలు మాత్రమే. లైకులు, కామెంట్లు, ఫాలోవర్లు కాదు. ఇన్‌స్టాగ్రామ్‌లో కనిపించే ప్రతి నవ్వు వెనుక ఆనందం ఉండకపోవచ్చు. ప్రతి విలాసవంతమైన ఫొటో వెనుక ప్రశాంతమైన జీవితం ఉండకపోవచ్చు. అలాగే సాధారణంగా కనిపించే మన జీవితంలోనూ అపారమైన ఆనందం దాగి ఉండవచ్చు.

ఇతరుల జీవితాలతో మన జీవితాన్ని పోల్చుకోవడం మానేసి, నిన్నటి మనకంటే నేడు ఎంత ఎదిగామో చూసుకోవాలి. ఎందుకంటే మన జీవితానికి నిజమైన అర్థాన్ని ఇచ్చేది డిజిటల్ ప్రపంచంలోని ప్రశంసలు కాదు.. మన చుట్టూ ఉన్న మనుషుల ప్రేమ, ఆప్యాయత, మన కృషి, మన ఆత్మసంతృప్తి.



డాక్టర్ ఎస్ రాజారామ్
సెల్ : 7799910222



ఉదయం లేవగానే ఆందోళనా?

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది ఉదయం నిద్రలేవగానే ఏదో తెలియని ఆందోళన, భయం మరియు గుండెదడ వంటి లక్షణాలతో ఇబ్బంది పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం మన శరీరంలోని 'కార్టిసాల్ అవేకెనింగ్ రెస్పాన్స్' (Cortisol Awakening Response – CAR) దెబ్బతినడమేనని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సాధారణంగా మనం నిద్రలేచినప్పుడు శరీరాన్ని చురుగ్గా ఉంచేందుకు 'కార్టిసాల్' అనే స్ట్రెస్ హార్మోన్ సహజంగానే విడుదలవుతుంది. అయితే, తీవ్రమైన మానసిక ఒత్తిడి, సరైన నిద్ర లేకపోవడం మరియు అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల వల్ల ఈ హార్మోన్ స్థాయిలు అదుపు తప్పుతాయి. ఫలితంగా ఉదయాన్నే శరీరం అతిగా స్పందించి ఆందోళన, అసహనం వంటి సమస్యలకు దారితీస్తుంది.

నియంత్రణకు పాటించాల్సిన ఉదయపు అలవాట్లు

ఈ ఉదయపు ఆందోళనను అదుపులో ఉంచుకోవడానికి జీవనశైలిలో కొన్ని చిన్న మార్పులు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం నిద్రలేవగానే కనీసం 10 నిమిషాల పాటు లేత ఎండలో గడపడం వల్ల శరీరంలోని హార్మోన్లు సమతుల్యమవుతాయి. అలాగే, చాలామందికి అలవాటు ఉన్నట్లుగా లేవగానే ఖాళీ కడుపుతో కాఫీ లేదా టీ తాగడం మానుకోవాలి, ఎందుకంటే కెఫిన్ కార్టిసాల్ స్థాయిలను మరింత పెంచి ఆందోళనను తీవ్రతరం చేస్తుంది. వీటికి బదులుగా రోజువారీ దినచర్యలో యోగా, ధ్యానం మరియు తేలికపాటి వ్యాయామాలను భాగం చేసుకోవడం వల్ల మనసు ప్రశాంతంగా మారి ఉత్సాహంగా ఉండవచ్చని వైద్యులు సలహా ఇస్తున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 23.11.2026
www.mudranews.in | @mudranews

ఐరన్, విటమిన్ ఎ, ఫైబర్‌కు ప్రాధాన్యత

శరీరానికి అవసరమైన పోషకాలు అందాలంటే ఐరన్, విటమిన్ ఎ, ఫైబర్ ఉన్న ఆహారం తీసుకోవాలి. ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



కమ్యూనిస్టు పార్టీల ఐక్యత నేటి చారిత్రక అవసరం

ప్రజాస్వామ్య పరిరక్షణకు వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ఏకం కావాలి
నవంబర్ 28న ఢిల్లీలో జాతీయ ఐక్యతా సదస్సు
సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 33 వ్యాసాల పుస్తకావిష్కరణ



ముద్ర, హైదరాబాద్, నవంబర్ 22: దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం పరిరక్షణ కోసం కమ్యూనిస్టు పార్టీలు, వామపక్ష ప్రజాతంత్ర శక్తులన్నీ ఐక్యం కావాల్సిన చారిత్రక అవసరం ఏర్పడిందని వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యవేదిక (యూఎల్డీఎఫ్) నాయకులు పిలుపునిచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక అసమానతలు, విద్యా, వైద్య రంగాల్లో పెరుగుతున్న కార్పొరేట్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సభలో వక్తలు మాట్లాడుతూ దేశంలో విద్య, వైద్యం సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం, పేదరికం, ధరల పెరుగుదల ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న మనువాద శక్తులు ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తున్నాయని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో 13 కోట్ల మంది ఓటర్లను తొలగించారంటూ ఆరోపించారు. రాజ్యాంగం, ప్రజాస్వామిక విలువల పరిరక్షణపై ప్రజల్లో ఆందోళన పెరుగుతోందని అన్నారు.ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీలు, సామాజిక ప్రజాసంఘాలు, ప్రజాతంత్రవాదులను ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యవేదిక (యూఎల్డీఎఫ్) ఏర్పాటైందని వివరించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, సామాజిక న్యాయ పరిరక్షణతో పాటు ప్రజల జీవన సమస్యల పరిష్కారమే వేదిక ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి సుదీర్ఘ పోరాట చరిత్ర ఉందని, కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల సాధనలో కమ్యూనిస్టు పార్టీలు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. అయితే వివిధ కారణాలతో పార్టీలు విడిపోవడం వల్ల ప్రజా ఉద్యమాల బలం తగ్గుతోందని అభిప్రాయపడ్డారు. గతంలో ఏర్పడిన విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకొని ఉమ్మడి లక్ష్యాల ఆధారంగా కమ్యూనిస్టు పార్టీల పునరేకీకరణకు కృషి చేయాలని కోరారు.కమ్యూనిస్టు పార్టీల ఐక్యత కేవలం ఎన్నికల పొత్తులకే పరిమితం కాకుండా ప్రజల సమస్యలపై నిరంతరం ఉమ్మడి పోరాటాలు నిర్వహించే శాశ్వత ఐక్యతగా రూపుదిద్దుకోవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. వామపక్ష ఉద్యమంపై ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే పార్టీల మధ్య ఐక్యత అనివార్యమని పేర్కొన్నారు.నవంబర్ 28న ఢిల్లీలో జాతీయ సదస్సుక మ్యూనిస్టు పార్టీల ఐక్యత లక్ష్యంగా యూఎల్డీఎఫ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 20న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. అదే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా వివిధ కమ్యూనిస్టు పార్టీల నాయకులతో చర్చలు,సంప్రదింపులు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగా ఈ నెల 28న న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో జాతీయ ఐక్యతా సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. వివిధ కమ్యూనిస్టు పార్టీల ముఖ్య నాయకులు ఈ సదస్సులో పాల్గొంటారని, ఐక్యత దిశగా ఇది కీలక ముందడుగు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.33 వ్యాసాలతో పుస్తకావిష్కరణసభలో 'దేశం కోసం – వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఏకం కావాలి' అనే పేరుతో రూపొందించిన 33 వ్యాసాల పుస్తకాన్ని సినీ కళాకారుడు మాదాల రవి ఆవిష్కరించారు. కమ్యూనిస్టు పార్టీల ఐక్యత ఆవశ్యకత, వామపక్ష ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉమ్మడి కార్యాచరణ వంటి అంశాలను వివిధ రచయితలు ఈ పుస్తకంలో విశ్లేషించారు.ఈ సభకు యూఎల్డీఎఫ్ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షత వహించగా, ముఖ్య వక్తలుగా సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, యూఎల్డీఎఫ్ కో–కన్వీనర్ ప్రొఫెసర్ వెంకటదాసు మారెడు, రేకా చంద్రశేఖరరావు, ఆంధ్రప్రదేశ్ యూఎల్డీఎఫ్ నాయకుడు వెంకయ్య ప్రసంగించారు.ఉద్యమ గీతాలతో సాంస్కృతిక కార్యక్రమాలుబొజ్జా భిక్షమయ్య ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గాయకులు సుక్క రాంనర్సయ్య, రాజ నర్సింహ (పీకేఎం), స్వప్న (అరుణోదయ), పల్లె నర్సింహ తదితరులు ఆలపించిన పాటలు సభికులను ఆకట్టుకున్నాయి. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, ప్రజా పోరాటాల స్ఫూర్తిని ప్రతిబింబించే గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.సభ నిర్వహణ కమిటీ సభ్యులుగా కోలా జనార్దన్, ప్రొఫెసర్ గోళ్ల రమేష్, బండారు లక్ష్మయ్య, డాక్టర్ నాగేశ్వరరావు, ప్రొఫెసర్ మొయినొద్దీన్, నైనాల గోవర్ధన్, మునీరుద్దీన్ ముజాహిద్, జక్కుల నాగయ్య, డాక్టర్ శ్రీనివాస్, వీజయ్ కుమార్ వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు నాయకులు గాదగోని రవి, ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి, కె.రమ (సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్), కె.గోవర్ధన్ (సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), జానకి రాములు (ఆర్ఎస్పీ), మామిండ్ల రమేష్ రాజా (సీపీఐ ఎంఎల్ లిబరేషన్), సీతారాములు పాల్గొన్నారు.వామపక్ష ప్రజాస్వామ్య మేధావులు కందిమల్ల ప్రతాప్ రెడ్డి, ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, అబ్దుల్ హక్ ఖమర్, మహ్మద్ అబ్దుల్ అజీజ్, పల్లాటి మల్లేష్, డాక్టర్ మార్క శంకరనారాయణ తదితరులు కమ్యూనిస్టుల ఐక్యత ఆవశ్యకతపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.కమ్యూనిస్టు పార్టీల మధ్య ఉన్న విభేదాల కంటే ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వామపక్ష శక్తులన్నీ ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగాలని సభ పిలుపునిచ్చింది. యూఎల్డీఎఫ్ ప్రారంభించిన ఐక్యతా ప్రయత్నాలను మరింత విస్తృతం చేసి, అన్ని కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాలు సానుకూలంగా స్పందించాలని కోరింది.ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందాలంటే కమ్యూనిస్టుల ఐక్యతే మార్గమని సభ స్పష్టం చేసింది.

డంపింగ్ యార్డు తొలగింపు పోరాటానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి మద్దతు



ముద్ర, జవహర్ నగర్: జవహర్‌నగర్ డంపింగ్ యార్డు తొలగించాలని డిమాండ్ చేస్తూ చెన్నాపురం చౌరస్తాలో ప్రారంభించిన రిలే నిరాహార దీక్షల మొదటి రోజు కార్యక్రమం విజయవంతమైంది. ఈ దీక్షలకు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాటలు, మాటలు, నినాదాలతో ఉద్యమకారుల్లో ఉత్సాహం నింపుతూ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా డంపింగ్ యార్డు కాలుష్యంతో జవహర్‌నగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన, కలుషిత నీరు, విషపూరిత గాలితో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డును శాస్త్రీయంగా మూసివేసి, కొత్త చెత్తను తరలించడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమానికి ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ కూడా మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ మాట్లాడుతూ డంపింగ్ యార్డు తొలగించే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దమ్మాయిగూడ యాంటీ డంపింగ్ యార్డు జేఏసీతో పాటు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు దీక్షలో పాల్గొని మద్దతు ప్రకటించారు. కాగా జాన్, వెంకటాచారి ఆలపించిన ఉద్యమ గీతాలు దీక్షా శిబిరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఉద్యమకారుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

భారత్ చేరుకున్న నేపాల్ ప్రధాని బాలెన్ షా

సోమవారం ప్రధాని మోదీతో చర్చలు



ముద్ర, న్యూఢిల్లీ: నేపాల్ ప్రధాని బాలెన్ షా తొలి పర్యటనలో భాగంగా ఆదివారం భారత్ చేరుకున్నారు. వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఆయనకు స్వాగతం పలికారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, నేపాల్ ప్రధాని బాలెన్ షా సమావేశం కానున్నారు. ఇంధనం, జలవిద్యుత్, రైల్వేలు, కనెక్టివిటీ, మౌలిక సదుపాయాల రంగాలతో పాటు ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు జరుగనున్నాయి. కాగా, నేపాల్‌లో పలు ప్రాజెక్టులను ఇరు దేశాల ప్రధానమంత్రులు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అలాగే ఆర్థికవృద్ధి, సామాజిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పు వంటి సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తున్నది. భారతదేశం నేపాల్‌కు అతిపెద్ద వాణిజ్య, రవాణా, పెట్టుబడి భాగస్వామి ఉన్నది. భారత మార్కెట్‌లోకి పన్ను రహిత ప్రవేశాన్ని కూడా ఆ దేశం పొందుతున్నది. మరోవైపు నేపాల్, భారత్ మధ్య చాలా కాలంగా సరిహద్దు వివాదం కూడా ఉన్నది. లిపులేఖ్, లింపియాధురా, కాలాపాని ప్రాంతాలు ఉత్తరాఖండ్‌లో భాగమని భారత్ స్థిరంగా వాదిస్తున్నది. మే నెలలో నేపాల్ ప్రధాని బాలెన్ షా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. సరిహద్దు వివాదాన్ని పరిష్కరించడానికి చైనా, బ్రిటన్ దేశాల ప్రమేయాన్ని ఆయన కోరారు. అయితే మూడో పక్షాల పాత్రను భారత్ తిరస్కరించింది. సరిహద్దు సమస్యకు సంబంధించిన అన్ని అంశాలను పరిష్కరించుకోవడానికి ఇరు దేశాల మధ్య ఒక సుస్థిరమైన ద్వైపాక్షిక యంత్రాంగం ఉన్నదని పేర్కొంది.

జనం కోసం ఒక్కటిగా పని చేస్తాం

సీ సీ ఎస్ అధ్యక్షులు పద్మారెడ్డి



ముద్ర, కుషాయిగూడ: గడిచిన ఆరేళ్లుగా కాలనీ కమిటీల సమాఖ్య సిసిఎస్ పేరుతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారులు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుందని రెండవసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎంపల్లి పద్మా రెడ్డి అన్నారు.ఆదివారం కాప్రా సర్కిల్ పరిధిలోని కాలనీ సంఘాల సభ్యులు ఒకటై శివ సాయి నగర్ శివ సాయి దేవాలయ ప్రాంగణంలో సిసిఎస్ అధ్యక్షునిగా పద్మా రెడ్డిని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్ కు చెందిన వివిధ విభాగాల అధికారులు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు.త్వరలోనే సిసిఎస్ పూర్తిస్థాయి కమిటీని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

సామాజిక పరివర్తన విద్యార్థులతోనే సాధ్యం

మహనీయుల ఆశయ సాధన మాదిగ విద్యార్థుల కర్తవ్యం
ఎంఆర్పీఎస్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ



ముద్ర ప్రతినిధి, ఎల్బీనగర్: దేశంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనం, అణచివేత, సామాజిక అసమానతలు, వివక్షాపూరిత ధోరణులు తొలగిపోయి సమానత్వంతో కూడిన నూతన సమాజం నిర్మాణం కావాలంటే సామాజిక పరివర్తన విద్యార్థులతోనే సాధ్యమని ఎంఆర్పీఎస్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ, ఎంఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ అన్నారు.ఎల్బీనగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఏబీసీ పాఠశాల ఆవరణలో ఎంఎస్ఎఫ్ సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలాల నూతన కమిటీల ఏర్పాటు సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి ఎంఆర్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుల వివక్ష తన రూపాలను మార్చుకుంటూ నేటికీ దళితులు, అణగారిన వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కులరహిత భారతదేశ నిర్మాణాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆకాంక్షించారని, ఆయన ఆశయ సాధన దిశగా మందకృష్ణ మాదిగ సామాజిక ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో దళిత, పీడిత వర్గాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.మాదిగ సామాజిక వర్గంలో అక్షరాస్యత శాతం పెంచేందుకు గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను చైతన్యపరచాల్సిన అవసరం ఉందన్నారు. జనాభా పరంగా అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ మాదిగ సామాజిక వర్గం విద్య, ఆర్థిక, సామాజిక రంగాల్లో వెనుకబడి ఉందని పేర్కొన్నారు. నిరక్షరాస్యత, పేదరికం, భూమిలేని నిరుపేదల సమస్యల నుంచి బయటపడేందుకు విద్య ఒక్కటే ప్రధాన మార్గమని స్పష్టం చేశారు. మాదిగలతో పాటు పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ఎంఆర్పీఎస్ సాధించిన ఎస్సీ వర్గీకరణ చట్టం ద్వారా లభిస్తున్న 9 శాతం రిజర్వేషన్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యా, ఉద్యోగ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. బుద్ధుడి నుంచి మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్, కాన్షీరామ్ వరకు, నేటి మందకృష్ణ మాదిగ వరకు మహనీయులు సాగించిన పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఇందుకోసం ఎంఎస్ఎఫ్, ఎంఎస్యూ విద్యార్థి సంఘాల్లో చేరి సామాజిక ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.నూతన కమిటీల ఎన్నికసమావేశంలో సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలాల ఎంఎస్ఎఫ్ నూతన కమిటీలతో పాటు ఎంఎస్ఎఫ్ చైల్డ్ కమిటీని ఎన్నుకున్నారు.సరూర్‌నగర్ మండల కమిటీ:అధ్యక్షుడు: మొండి కత్తి గణేష్ మాదిగఅధికార ప్రతినిధి: మంద భాను మాదిగప్రధాన కార్యదర్శి: బర్ఫటి వినయ్ మాదిగఉపాధ్యక్షుడు: కందుల శివ మాదిగకార్యదర్శులు: మంద ప్రభాస్ మాదిగ, మంద ఉమేష్ మాదిగప్రచార కార్యదర్శి: మంద మనోహర్ మాదిగహయత్‌నగర్ మండల కమిటీ:అధ్యక్షుడు: జకారం రామ్ చరణ్ మాదిగఅధికార ప్రతినిధి: ఎరపుల గణేష్ప్రధాన కార్యదర్శి: బస్తుల రామకృష్ణ మాదిగఉపాధ్యక్షులు: ముత్యాల స్టాలిన్ మాదిగ, కుమపాటి రజిని మాదిగకార్యదర్శులు: కాల్పూరి శ్రవణ్ మాదిగ, కీనేరా భవ్యశ్రీ మాదిగప్రచార కార్యదర్శి: అరవింద్ మాదిగఎంఎస్ఎఫ్ చైల్డ్ కమిటీ:అధ్యక్షుడు: అంకురి కార్తీక్ మాదిగఅధికార ప్రతినిధి: మద్దిమడుగు శివ మాదిగప్రధాన కార్యదర్శి: అంకురి చరణ్ మాదిగఉపాధ్యక్షుడు: దోసపాటి వినోద్ మాదిగకార్యదర్శులు: కొత్తపల్లి కార్తీక్ మాదిగ, మొలగార శ్రీకాంత్పలువురు నాయకుల హాజరుఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ మాజీ రాష్ట్ర కళామండలి అధ్యక్షుడు మల్లేపక అనిల్ మాదిగ, ఎంఎస్పీ ఎల్బీనగర్ కో–ఇన్‌చార్జి ఎర్ర రవీందర్ మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు బత్తిన సుధాకర్ మాదిగ, ఎంఎస్పీ ఎల్బీనగర్ కో–ఇన్‌చార్జి మల్లెపోగు రాజు మాదిగ, ఎంఆర్పీఎస్ హయత్‌నగర్ మండల అధ్యక్షుడు కొమ్ము శివ మాదిగ, సీనియర్ నాయకులు అనంత సురేష్ మాదిగ, రవి మాదిగ, కలకొట్ల సాయి మాదిగ, కొత్తపేట ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు మంద శేఖర్ మాదిగ, సీనియర్ నాయకులు మీసాల నాగరాజు, సూరారపు హుస్సేన్, విజయ్, మహేందర్‌తో పాటు పలువురు మాదిగ విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాధ్యక్షుడినైన నాకంటే ఆమెకు బిడ్డపైనే ప్రేమ ఎక్కువ..

కరోలిన్ లీవిట్ గురించి ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు..!



ముద్ర, వాషింగ్టన్ డీసీ : వైట్‌హౌస్ మాజీ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లీవి పదవి నుంచి వైదొలిగినప్పటి నుంచి కొత్త సెక్రెటరీ ఎంపిక కోసం ట్రంప్ యంత్రాంగం వెతుకుతోంది. ఇటీవల కేటీ జకారియా ను కొత్త ప్రెస్ సెక్రెటరీగా నియమించినా ఆమె పనితీరుపై విమర్శలు వచ్చాయి. ఆమె విద్యార్హతలపై కూడా ప్రశ్నలు తలెత్తాయి. దాంతో పదవి చేపట్టిన ఐదు రోజుల్లోనే తొలగించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కరోలిన్ లీవిట్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశాధ్యక్షుడినైన తనకంటే ఆమెకు బిడ్డపైనే ఎక్కువ ప్రేమ ఉందన్నారు. అందుకే ఆమె బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తిరిగి విధుల్లోకి రావడానికి ఒప్పుకోలేదని చెప్పారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీగా ఆమె హుందాగా, అద్భుతంగా పనిచేశారని ప్రశంసించారు. ఇప్పుడు ఆమె స్థానంలో మరొకరిని నియమించడం కష్టంగా మారిందన్నారు. నిజంగా ఇది చాలా పెద్ద సమస్యని, ఈ విషయాన్ని తాను ఆమెతో కూడా చెప్పానని ట్రంప్ తెలిపారు. ఆమె నాకంటే తన బిడ్డనే ఎక్కువగా ప్రేమిస్తోందని, ఇది చాలా గొప్ప విషయమని అన్నారు. ప్రస్తుతం కరోలిన్ ఓ మీడియా సంస్థలో పని చేస్తున్నదని, త్వరలోనే ఆమె ఒక పెద్ద స్టార్ అవుతుందని ట్రంప్ పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 23.11.2026
www.mudranews.in | @mudranews

గుండె ఆరోగ్యానికి ఉప్పు తగ్గించాలి

హైబీపీతో బాధపడేవారు ఆహారంలో ఉప్పు పరిమాణాన్ని తగ్గించాలి. అధిక సోడియం గుండె సంబంధిత సమస్యల ముప్పును పెంచుతుంది. ఇష్టమైన ఆహారాలను పూర్తిగా మానేయకుండా, మితంగా తీసుకుంటూ సమతుల్య ఆహారపు అలవాట్లు పాటించాలి.



కాంగ్రెస్ హామీలపై కేటీఆర్ సవాల్..

మహిళల ఖాతాల్లో రూ.1.50 లక్షలు జమ చేయాలని డిమాండ్

నెలకు రూ.2,500 హామీ కింద 1.67 కోట్ల మంది మహిళలకు నిధులుఇవ్వాలని వ్యాఖ్యలు 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా

ముద్ర, వరంగల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. కోటి మంది ఆడబి డ్డలను కోటీశ్వరులను చేస్తామన్న హామీ సంగతి పక్కన పెడితే, నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీ కింద 1.67 కోట్ల మంది మహిళల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల చొప్పున జమ చేయాలని డిమాండ్ చేశారు.



ఉద్యమ రోజులను గుర్తు చేసుకున్న కేటీఆర్

29న తాను అరెస్టయి వరంగల్ సెంట్రల్ జైలులో ఖైదీగా గడిపిన రోజులను కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభం నుంచి రజతోత్సవ సభ వరకు ప్రతి దశలోనూ ఓరుగల్లు ప్రజలు తమకు అండగా నిలిచారని పేర్కొన్నారు. వరంగల్ ప్రజల ఆశీర్వాదం భవిష్యత్తులోనూ తమకు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2028లో కేసీఆర్ తిరిగి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై రాజకీయ విమర్శలతో పాటు, రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా ఉన్నాయి.

నవంబర్ 24న తిరుమలలో కార్తీక పర్వదీపోత్సవం



ముద్ర, తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో నవంబర్ 24న కార్తీక పౌర్ణమి సందర్భంగా సాలకట్ల కార్తీక పర్వదీపోత్సవాన్ని టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఆలయంలోని వివిధ ప్రాంతాల్లో నేతి వత్తులతో దీపాలను వెలిగించనున్నారు. మంగళవాయిద్యాల నడుమ దీపాల ఊరేగింపు, విమాన ప్రదక్షిణం నిర్వహించి ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి సమర్పిస్తారు. కాగా, ఉత్సవం నేపథ్యంలో నవంబర్ 24న పౌర్ణమి గరుడసేవతో పాటు సహస్ర దీపాలంకరణ సేవను టీటీడీ రద్దు చేసింది.

ఆయిల్‌పామ్ రైతుల విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం!

బహిరంగ విద్యుత్ తీగల స్థానంలో ఏబీ కేబుల్స్ ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల ప్రతిపాదన

ముద్ర, హైదరాబాద్: ఆయిల్‌పామ్ రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ లైన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వ్యవసాయ, ఉద్యాన శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రతిపాదన చేశారు. ఆయిల్‌పామ్ తోటల మధ్య నుంచి వెళ్తున్న బహిరంగ విద్యుత్ తీగల స్థానంలో సాంకేతికంగా సాధ్యమైన చోట్ల ఏబీ కేబుల్స్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు 2020–21లో 46 వేల ఎకరాల నుంచి 2026 అక్టోబర్ నాటికి 3.37 లక్షల ఎకరాలకు విస్తరించింది. ప్రస్తుతం 92 వేల మందికి పైగా రైతులు ఈ పంట సాగు చేస్తున్నారు. అయితే తోటల మధ్య నుంచి వెళ్లే 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ లైన్ల కారణంగా భద్రతా దూరాలు పాటించాల్సి రావడంతో ఎకరాకు 6 నుంచి 8 మొక్కలు నాటలేక రైతులు ఆదాయం కోల్పోతున్నారు. నిర్మల్ జిల్లా కనకాపూర్‌లో నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ సమస్య తీవ్రత వెల్లడైంది. అక్కడ విద్యుత్ లైన్ కారణంగా 20 ఆయిల్‌పామ్ మొక్కలు నాటలేని పరిస్థితి ఉంది. ఈ మొక్కల ద్వారా 35 ఏళ్లలో సుమారు రూ.27.45 లక్షల స్థూల ఆదాయం పొందే అవకాశం ఉండగా, విద్యుత్ లైన్‌ను ఏబీ కేబుల్‌గా మార్చేందుకు కేవలం రూ.1.45 లక్షలే ఖర్చవుతుందని అంచనా వేశారు. ఏబీ కేబుల్స్ ఏర్పాటుతో విద్యుత్ అంతరాయాలు, షార్ట్‌సర్క్యూట్లు, అగ్ని ప్రమాదాలతో పాటు కోత సమయంలో కార్మికులకు ఎదురయ్యే ప్రమాదాలను కూడా తగ్గించవచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు. రైతులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడం లేదా డిస్కంల ఛార్జీల్లో మినహాయింపులు కల్పించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. విద్యుత్, ఉద్యాన శాఖలు సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఈ ప్రతిపాదన అమలైతే రైతులకు అదనపు మొక్కలు నాటుకునే అవకాశం కలగడంతో పాటు దిగుబడి, ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

వసతి గృహాల కోసం మెడికోల నిరసన



ముద్ర, కరీంనగర్ : 'భవిష్యత్తు డాక్టర్లు ఇక్కడ.. మా కళాశాల భవనం ఎక్కడ..?' అంటూ కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు వినూత్న నినాదాలతో నిరసన తెలిపారు. నవంబరు 20న నూతన వసతి గృహ భవనాన్ని అప్పగిస్తామని అధికారులు హామీ ఇచ్చినా అమలు కాకపోవడంతో నుంచి రాత్రి వరకు కళాశాల ప్రధాన ద్వారం పక్కన ధర్నా నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు వచ్చి ప్రిన్సిపల్ సమక్షంలో నచ్చజెప్పినప్పటికీ ఫలితం లేకపోయింది. కొంతమంది విద్యార్థులు కలెక్టరేట్‌కు వెళ్లి అదనపు కలెక్టర్‌ను కలిసి సమస్యలు విన్నవించినా స్పష్టమైన హామీ రాకపోవడంతో సాయంత్రం వరకు కళాశాల ముందే విద్యార్థులు బైఠాయించారు. ప్రస్తుతం కళాశాల నిర్వహిస్తున్న గోదాం తరహా షెడ్డుల్లో రెండు తరగతి గదులు, రెండు లెక్చర్ గ్యాలరీలతోనే బోధన సాగుతోందని, తరగతుల సమయంలో రెండు, మూడు సార్లు సీలింగ్ ఊడిపడ్డాయన్నారు. మూడు బ్యాచ్‌లకు చెందిన 300 మంది విద్యార్థులకు మూడు మూత్రశాలలు, మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయన్నారు.విద్యానగర్, అంబేడ్కర్ స్టేడియం సమీపంలో, తీగలగుట్టపల్లిలోని ప్రైవేటు భవనాల్లో వసతి కల్పించారన్నారు. దాదాపు 90 శాతం పూర్తయిన వసతిగృహ భవనాలు అప్పగించడంలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు.

బీఎం సందీప్ ను కలిసిన పృథ్వీ చౌదరి



ముద్ర, హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ ఇన్‌ఛార్జిగా నియమితులై, తొలిసారిగా తెలంగాణకు విచ్చేసిన బీఎం సందీప్ కుమార్ కి TPCC జనరల్ సెక్రటరీ పృథ్వీ చౌదరి శుభాకాంక్ష లు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీభవన్ లో జరిగిన టీపీసీసీ ఎక్స్ క్యూటివ్ మీటింగ్ సమావేశం లో సందీప్ గారితో పాటు సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి గారు, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారు, మంత్రులు, పాల్గొన్నారు.

మంథనిలో పర్యటించిన ఎంపీ

ముద్ర, పెద్దపల్లి : మంథనిలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పర్యటించారు. ఈ సందర్భంగా కాకా వెంకటస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల కొయ్యూరు గ్రామంలో విశాఖ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీతో పాటు పాల్గొన్న లకావత్ సవేందర్, లకావత్ లక్ష్మి, దేవి భూమయ్య, సలీంకు టెలికాం, రైల్వే శాఖల అడ్వైజరీ బోర్డు మెంబర్లుగా నియామక పత్రాలను అందజేశారు. నూతనంగా ఎంపికైన టెలికాం, రైల్వే శాఖల అడ్వైజరీ బోర్డు మెంబర్లు ఎంపీ వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

హారన్ మోగని నగరం ఐజ్వాల్

- ఆనంద్ మహీంద్రా ఆసక్తికర పోస్ట్

ముద్ర, హైదరాబాద్ : మిజోరం రాజధాని ఐజ్వాల్‌లోని విశిష్ట ట్రాఫిక్ క్రమశిక్షణపై ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీం ద్రా ప్రశంసల జల్లు కురిపించారు. ఎంతటి భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడినా వాహన దారులు సంయమనం పాటిస్తూ, హారన్ల మోత లేకుండా క్రమశిక్షణతో వేచి ఉండే సంస్కృతిని ఆయన కొనియాడారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో ఓ వీడియోను పంచుకున్నారు. ఆదివారం నాడు ఆయన షేర్ చేసిన వీడియోలో ఐజ్వాల్ రోడ్లపై వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయి ఉన్నాయి. అయితే ఎక్కడా హారన్ల శబ్దం వినిపించకుండా రోడ్లన్నీ పూర్తి నిశ్శబ్దంగా కనిపించాయి. ఆ వీడియోలో కనిపించిన ఒక స్థానిక మహిళ మాట్లాడుతూ.. "ఇక్కడ చాలా వాహనాలు ఉన్నాయి, కానీ ఎవరూ హారన్ కొట్టరు. మిజో ప్రజలకు సహనం ఎక్కువ, నిబంధనలను కచ్చితంగా పాటిస్తారు" అని వివరించారు. రెండు మూడు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయినా స్టాప్ లైన్ దాటకుం డా, లేన్ జంపింగ్ చేయకుండా ప్రశాంతం గా వేచి ఉంటారని ఆమె తెలిపారు. ఈ అంశంపై ఆనంద్ మహీంద్రా స్పందిస్తూ తన #SundayWanderer సిరీస్‌లో ప్రత్యేకంగా రాసుకొచ్చారు. "మన రద్దీ నగరాల్లో నిశ్శబ్దం అనేది ఒక అరుదైన విలాసంగా మారిపోయింది" అని ఆయన పేర్కొన్నారు. సాధారణంగా పర్యాటకులు అందమైన ప్రకృతి దృశ్యాలు, చారిత్రక కట్టడాల కోసం ప్రయాణాలు చేస్తుంటారని, అయితే భవిష్యత్తులో కేవలం ప్రశాంతత, నిశ్శబ్దం కోసమే ప్రజలు పర్యటనలు చేసినా ఆశ్చర్యం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

కరీంనగర్ లో అఖండ హనుమాన్ చాలీసా పారాయణం





ముద్ర, కరీంనగర్ : కార్తిక మాసం సందర్భంగా కరీంనగర్‌లోని అశోక్ నగర్‌లో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అఖండ చాలీసా పారాయణం చేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన భక్త బృందాలు వంతుల వారీగా హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ట్రస్ట్ చైర్మన్ చిట్టి మల్ల శ్రీనివాస్, గురుస్వామి భోగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సాయంత్రం కార్తిక దీపోత్సవం జరగనుంది.

కార్తికమాసం సందర్భంగా కరీంనగర్లోని వాణిజ్య కూడలి ప్రకాశం గంజిలో ఆదివారం మధ్యాహ్నం సామూహిక సత్యనారాయణ వ్రతాలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. పండితులు మంగళంపల్లి వేణుగోపాల్ శర్మ, ఆలయ ప్రధాన పూజారి రత్నాకర్ శర్మ ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రత పూజలతోపాటు కథలను వివరిస్తూ భక్తులచే వ్రతాలను ఆచరింపజేశారు.

హైదరాబాద్‌లో కేఆర్ఎంబీ కీలక సమావేశం

కృష్ణా జలాల విడుదలపై చర్చ.. ఏపీకి 9 టీఎంసీల నీటి కేటాయింపుపై ప్రధానంగా చర్చ

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ, నీటి అవసరాలపై ఈ నెల 23వ తేదీన హైదరాబాద్‌లో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) మూడు సభ్యుల కమిటీ కీలక సమావేశం నిర్వహించనుంది. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శితో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. నాగార్జునసాగర్ నుంచి తాగునీటి అవసరాల కోసం 9 టీఎంసీల నీటిని విడుదల చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ చేసిన విజ్ఞప్తి ప్రధాన అజెండాగా ఉండనుంది.మూడు నెలల తాగునీటి అవసరాల కోసం 9 టీఎంసీల నీటిని కోరుతూ ఏపీ ప్రతిపాదనలు సమర్పించింది. ఇందులో నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల, మార్కాపురం, ప్రకాశం జిల్లాలకు 8 టీఎంసీలు, ఎడమ కాలువ ద్వారా ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాలకు ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని కోరింది.

పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరం

మరోవైపు నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తరలించేందుకు ఏపీ చేపట్టినట్లు చెబుతున్న పల్నాడు వాటర్ గ్రిడ్ టన్నెల్ ప్రాజెక్టుపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయనుంది. తెలంగాణకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, కేఆర్ఎంబీ అనుమతి లేకుండా ఈ ప్రాజెక్టు చేపట్టడంపై తన అభ్యంతరాలను సమావేశంలో నమోదు చేయాలని భావిస్తోంది.

కృష్ణా జలాల విడుదల, ఇరు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, నీటి పంపిణీ అంశాలపై ఈ సమావేశంలో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

తిరుపతిలో మరో కొత్త నగరం..

- అలిపిరి వద్ద రూ.2,750 కోట్లతో మెగా టౌన్‌షిప్

ముద్ర, కరీంనగర్ : తిరుపతిలోని అలిపిరి–ఎస్వీ జూ పార్క్ రోడ్డులోని స్థలంలో అత్యాధునిక సదుపాయాలతో పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది. శ్రీవాణి ట్రస్ట్ నిధుల నుంచి రూ.2,750 కోట్ల అంచనా వ్యయంతో దీనిని చేపట్టనున్నారు. తిరుపతికి వచ్చే భక్తులకు ఒకేచోట మెరుగైన వసతి, ఆధునిక సదుపాయాలు కల్పించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఈ ప్రాజెక్టు డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్), డిజైన్లు, పనుల పర్యవేక్షణ కోసం అనుభవజ్ఞులైన కన్సల్టెన్సీని నియమించేందుకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ ప్రణాళికా దశలోనే ఉంది.

డిసెంబర్ 20 నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు


ఈ ఏడాది డిసెంబర్ 20 నుంచి 29 వరకు మొత్తం 10 రోజుల పాటు తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నారు. ఈ పది రోజుల్లో సుమారు 8.34 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. గత ఏడాదితో పోలిస్తే దాదాపు 51 వేల మందికి అదనంగా దర్శన భాగ్యం కల్పించనుండటం విశేషం. మొత్తం దర్శన సమయంలో 92 శాతం సమయాన్ని సాధారణ భక్తులకే కేటాయించాలని నిర్ణయించారు.

మొదటి రెండు రోజులైన వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో ఉచిత సర్వదర్శనం ఉండదు. కేవలం ఆన్‌లైన్ ద్వారా జారీ చేసే ఎస్ఎస్‌డీ (SSD) టోకెన్లు ఉన్న భక్తులను మాత్రమే దర్శనానికి అనుమతిస్తారు. మిగిలిన ఎనిమిది రోజులు సర్వదర్శనం యథావిధిగా కొనసాగుతుంది. అయితే ఈ ఎస్ఎస్‌డీ టోకెన్లను ఆన్‌లైన్‌లో ఎప్పుడు విడుదల చేస్తారనే తేదీని టీటీడీ ఇంకా ప్రకటించలేదు.

టీటీడీ మరికొన్ని కీలక నిర్ణయాలు:

గో సంరక్షణ: ఆలయంలో నిత్య కైంకర్యాలు, శ్రీవారి ప్రసాదాల తయారీకి అవసరమైన స్వచ్ఛమైన పాలు, నెయ్యిని స్థానికంగానే ఉత్పత్తి చేసేందుకు రూ.7.5 కోట్ల వ్యయంతో 500 దేశీయ ఆవులను కొనుగోలు చేయనున్నారు. పర్యావరణం, పారిశుద్ధ్యం: తిరుమల క్షేత్రాన్ని నెట్ –జీరోగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా పర్యావరణ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణ కోసం అదనంగా 348 మంది సిబ్బందిని నియమించనున్నారు.

అటవీ పరిరక్షణ: శేషాచలం అటవీ ప్రాంత సంరక్షణ



కోసం అటవీశాఖకు రెండేళ్ల కాలానికి రూ.16.4 కోట్లు విడుదల చేయడానికి ఆమోదం తెలిపారు.

విద్య, వైద్య రంగాలు: స్విమ్స్ ఆసుపత్రి అభివృద్ధికి అదనంగా రూ.41.23 కోట్లు మంజూరు చేశారు. ఆయుర్వేద కళాశాలలో అదనంగా 20 బీఏఎంఎస్ సీట్లను పెంచనున్నారు. అలిపిరి సమీపంలోని శిల్పకళా కళాశాలలో 229 మంది విద్యార్థుల వసతి కోసం రూ.23 కోట్లతో నూతన హాస్టల్ భవనాన్ని నిర్మించనున్నారు.

కేబుల్ బ్రిడ్జి అధ్యయనం: అలిపిరి కాలినడక మార్గంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి మోకాళ్లమిట్ట వైపు కేబుల్ బ్రిడ్జి నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఐఐటీ నిపుణులతో సమగ్ర అధ్యయనం చేయించాలని బోర్డు నిర్ణయించింది.

సిరిసిల్ల బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. బస్సును ఢీకొన్న కారు

స్విఫ్ట్ కారు నుజ్జునుజ్జు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

ముద్ర, సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డుపై చంద్రంపేట చౌరస్తా వద్ద ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును స్విఫ్ట్ డిజైర్ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్ల నుంచి తాటిపల్లి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు (TS 02 Z 0202) చంద్రంపేట చౌరస్తా వద్ద బైపాస్ దాటుతుండగా, వెంకటాపూర్ నుంచి వేములవాడ వైపు వెళ్తున్న తెల్లని స్విఫ్ట్ డిజైర్ కారు (AP 28 DW 0689) వేగంగా వచ్చి బస్సును ఢీకొట్టింది. ఉదయం వేళ దట్టమైన పొగమంచు కారణంగా వాహనాలు సరిగా కనిపించకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.ఢీకొన్న తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ముందు అద్దం పగిలిపోగా, బానెట్ చితికిపోయింది. కారు విడిభాగాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. బస్సు ముందు భాగం, ముందు టైరు కూడా దెబ్బతిన్నాయి.కారులో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి తీవ్ర రక్తస్రావంతో బానెట్‌పై పడిపోయి అపస్మారక స్థితికి చేరుకోగా, డ్రైవర్ సీటులో ఉన్న మరో వ్యక్తి కారులోనే ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది, స్థానికులు గడ్డపారల సహాయంతో కారు భాగాలను తొలగించి డ్రైవర్‌ను అతికష్టం మీద బయటకు తీశారు. అనంతరం ఇద్దరు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.బస్సులో ప్రయాణిస్తున్న వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో భారీ శబ్దం రావడంతో బస్సులోని మహిళా ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఘటనతో చంద్రంపేట చౌరస్తా వద్ద పెద్ద సంఖ్యలో స్థానికులు గుమిగూడారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 23.11.2026
www.mudranews.in | @mudranews

ఎముకల బలానికి కాల్షియం, విటమిన్ డి



వృద్ధాప్యంలో ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం కాల్షియం, విటమిన్ డి సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలి. పాల ఉత్పత్తులు, పోషక విలువలున్న ఇతర పదార్థాలను ఆహారంలో చేర్చుకోవాలి.

పోలియో రహిత సమాజానికి కృషి చేయాలి

శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో



పోలియో చుక్కలు వేస్తున్న శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెకపూడి గాంధీ




పోలియో చుక్కలు వేస్తున్న కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

ముద్ర, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో "పోలియో దినం – ప్రతిసారి రెండు చుక్కలు, పోలియో పై నిరంతరంగా విజయం" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెకపూడి గాంధీ, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డిఏంహెచ్ఓ డా.సీ హెచ్ రాకేష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా. ఉమా దీపిక, డా. మొహమ్మద్ అవైస్ తో కలిసి రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్ విశిష్ట అతిథులుగా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్ మాట్లాడుతూ 5 ఏండ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని.. ఒక్క చిన్నారి కూడా చుక్కలు వేసుకోకుండా మిగిలిపోకూడదని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి యువత, వైద్య సిబ్బంది కలిసి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, గఫూర్, యువ నాయకులు మిరియాల ప్రీతం, బాలింగ్ గౌతమ్ గౌడ్, కొయ్యడ లక్ష్మణ్ యాదవ్, వార్డు మెంబర్ పర్వీన్ బేగం, వార్డు మెంబర్ రాము, బాపునగర్ హనుమాన్ యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, శ్రీకాంత్ దేవులపల్లి, గోపినగర్ అంబేద్కర్ భవన్ ప్రెసిడెంట్ రమేష్, మల్లేష్, సుధాకర్ రెడ్డి, మల్లేష్, మహేందర్ సింగ్, నటరాజ్, సందీప్, మహేష్, హరీష్, సాయి, ముంతాజ్ బేగం, పారామెడికల్ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో..

ముద్ర, కూకట్‌పల్లి : చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత అని, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మూసాపేట్ డివిజన్ పరిధిలోని బస్తీ దవాఖానాలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులు పోలియో వ్యాధి బారినపడకుండా ఉండేందుకు సకాలంలో చుక్కలు వేయించడం ఎంతో ముఖ్యమని అన్నారు. తల్లిదండ్రులు అశ్రద్ధ చేయకుండా ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వం అందిస్తున్న వైద్య, ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షులు తూము సంతోష్, కూకట్‌పల్లి నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ చన్ను పాషా, ఏఎంసీ డైరెక్టర్ ఇజాజ్, నాయకులు శంకర్, మస్తాన్ రెడ్డి, శివకుమార్ గౌడ్, చందర్ రావు, నాగార్జున, షహెన్షా తదితరులు పాల్గొన్నారు.



హయత్‌నగర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్

హయత్‌నగర్‌లో..

ముద్ర, హయత్‌నగర్: చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించేందుకు ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో ప్రారంభమైంది. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలనే లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో మొత్తం 114 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి, సుమారు 39,509 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు హయత్‌నగర్ పీహెచ్‌సీ పరిధి హెల్త్ ఎడ్యుకేటర్ (హెచ్ఈఓ) లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్నారు. చిన్నారులకు చుక్కలు వేయడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. పోలియో కేంద్రాలకు రాలేని చిన్నారులను గుర్తించి వారికి కూడా చుక్కలు అందించేలా ఆరోగ్య శాఖ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు.ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాట్లాడుతూ, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించడం ద్వారా భవిష్యత్తులో పోలియో వ్యాధి బారిన పడకుండా రక్షణ కల్పించవచ్చని తెలిపారు. ప్రతి ఇంటిలోని తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పోలీస్ బ్యాండ్ పోటీల్లో తెలంగాణ పోలీస్‌కు రజత పతకం

బిగిల్ విభాగంలో జాతీయ స్థాయిలో సత్తాచాటిన తెలంగాణ పోలీస్ బృందం
విజేతలను అభినందించిన డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్, నవంబరు 22 : 27వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ పోటీలు (2026–27)లో తెలంగాణ పోలీస్ బిగిల్ బృందం రజత పతకం సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా విజేతలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అభినందించారు. నవంబరు 16 నుంచి 20వ తేదీ వరకు హైదరాబాద్‌లోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో నిర్వహించిన ఈ జాతీయ స్థాయి పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీస్ బలగాలు, కేంద్ర సాయుధ పోలీస్ బలగాల బ్యాండ్, బిగిల్ బృందాలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో తెలంగాణ పోలీస్ బృందం ప్రతిభ కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ పోలీస్ ప్రతిభను చాటడం గర్వకారణమని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణ పోలీస్ బ్యాండ్, బిగిల్ బృందాలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్ది, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించేలా అవసరమైన చర్యలు చేపడతామని



తెలిపారు. రజత పతకం సాధించిన బృందంలో ఎస్. సంతోష్ (హెచ్‌సీ 1967) ఇన్‌చార్జి, కెప్టెన్‌గా వ్యవహరించగా, కె. స్వామి (హెచ్‌సీ 2562), ఎస్. వెంకటయ్య (హెచ్‌సీ 873), జి. వెంకటస్వామి (హెచ్‌సీ 1427), ఏవీఎస్ భావన రుషి (హెచ్‌సీ 197), కె. రామ్‌లాల్ (పీసీ 3361), ఎస్. ప్రవీణ్ కుమార్ (పీసీ 10250) సభ్యులుగా ఉన్నారు. వీరు రాష్ట్రంలోని వివిధ పోలీస్ బెటాలియన్లు, పోలీస్ శిక్షణ సంస్థలు, హైదరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఐజీ డాక్టర్ గజరావు భూపాల్, స్పోర్ట్స్ డీఎస్పీ డాక్టర్ రామారావుతో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కరాటే బెల్ట్ పరీక్షలు



ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్ లో రెంజుకి షోతోకన్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా స్థాయి కరాటే బెల్ట్ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ కరాటే పరీక్షలకు రెంజుకి షోతోకన్ కరాటే వ్యవస్థాపక అధ్యక్షులు నగేష్ మాస్టర్ ప్రధాన ఎగ్జామినర్ గా వ్యవహరించగా విద్యాసాగర్, నాగేంద్రలు పర్యవేక్షించారు. ఈ పరీక్షలకు 200 మంది విద్యార్థులు వివిధ మండలల నుండి పాల్గొన్నారు.ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బెల్టులు ప్రధానం చేశారు. యెల్లో బెల్ట్ విభాగంలో... సతిక్ష, దివ్యానష్, ఆరంజ్ విభాగంలో..లక్షి , సంస్రిత, సాత్విక్, అమృత్ హారన్, వినయ్ సాయి, అర్విక గ్రీన్ విభాగంలో...అన్విత ,తేజ,అద్విక సిద్దార్థ్,మాజ్,బ్లు బెల్ట్ విభాగంలో...సుప్రీత్, అక్షర, నవదీప్ బ్రౌన్ 4క్యూ విభాగంలో... శ్రీవల్లి, సాక్షి, సుహారిత్, సన్నీ, రన్వీర్ సింగ్, త్రీ జల్ సింగ్, విహాన్, శ్రేయాస్ బ్రౌన్ 3క్యూ విభాగంలో... సాన్విక, సహస్ర, చైతన్య శ్రీ, సుస్మశ్రీ, భీంరావ్ బ్లాక్ బెల్ట్ విభాగంలో... అనన్య,చిన్మయి, మనోజ్ఞ, సాన్విక, యశ్విత,సమ్రీన్, విలసిని, ఈశ్వర్ చంద్రలు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు బెల్ట్ ఎగ్జామ్ లో గెలుపు పొందిన విద్యార్థినిని విద్యార్థులకు సీనియర్ కరాటే మాస్టర్ నగేష్ బెల్ట్స్ ప్రధానం చేశారు. కరాటే మాస్టర్స్, ప్రసన్న, పరశురాం, కుమార్, దినకర్, బ్లాక్ బెల్ట్ విద్యార్థులు విశిష్ట రాజ్, అఖిల్, విహాన్ తదితరులు పాల్గొన్నారు

జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్



ముద్ర, కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం, కైతలాపూర్ డివిజన్‌లోని అంజనేయ నగర్ కమిటీ హాల్‌లో ప్రథమ జాతీయ కరాటే, కుంగ్‌ఫూ, టైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 'లీ కరాటే డో' వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు (విద్యార్థులు) హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ మరియు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్ విచ్చేసి క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, గూడెపు నాగరాజ్, చిన్ను భాషా, శేఖర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు సంతోష్, శంకర్, నాగార్జున, మస్తాన్ రెడ్డి మరియు కరాటే మాస్టర్ సంతోష్ పాల్గొన్నారు.

రూ.84 కోట్లతో అభివృద్ధి పనులు

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధికభూపతిరాజ్



ముద్ర ప్రతినిధి, మెదక్: ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో మెదక్ పట్టణంలో రూ. 84 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపాతిరాజ్ తెలిపారు. ఆదివారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్ తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. రాధిక మాట్లాడుతూ గత పదేళ్లలో జరగని అభివృద్ధి ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 3 ఏళ్లలో జరుగుతుందన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వార్డుల్లో అభివృద్ధి సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సన్నబియ్యం, ఉచిత విద్యుత్, మహిళకు బస్, స్మార్ట్ కార్డులు, పింఛన్లు, ఇందిరా జీవిత భీమా తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. చిల్డ్రన్స్ పార్కు అభివృద్ధికి రూ.3 కోట్లు, మెదక్ ఖిల్లా అభివృద్ధికి రూ.కోటి నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు అభివృద్ధిని పట్టించుకోకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రి హనుమంతరావు, ఎమ్మెల్యే రోహిత్ రావుపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మెదక్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ సిద్దిపేటలో నిర్వహించిన సభ విజయవంతం కావడంతో టీఆర్ఎస్ నాయకుల్లో ఆందోళన మొదలైందని వ్యాఖ్యానించారు. గతంలో మంత్రిగా పనిచేసిన హరీశ్ రావు సిద్దిపేట అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి మెదక్‌ను మాత్రం మరిచారని ఆరోపించారు. మెదక్ పట్టణం వ్యాపార, వాణిజ్య రంగాల్లో సైతం అభివృద్ధి చెందుతుందన్నారు. యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. గంగాధర్ మాట్లాడుతూ మెదక్ పట్టణంలో అభివృద్ధి పనులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో మెదక్ అభివృద్ధి వెనకబడిందన్నారు. రోహిత్ నాయకత్వంలో సర్కిళ్ల సుందరీకరణ తదితర అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, కానుగు భూపతి రాజు, తాహెర్, ఉమర్ మహియుద్దీన్, సాదిక్ అలీ, ఎండీ ఫాజిల్ పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గం

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించారు. అధ్యక్షులుగా పోతంశెట్టి వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షులుకె. వెంకట రమణ, ఎం. వినోద్, ఇ. శిరీష, టి. ఉపేందర్, ప్రధాన కార్యదర్శి గా కోనేటి గోపాల్, కోశాధికారి గోనూరు శ్రీనివాస్ సంయుక్త కార్యదర్శులు,కార్యవర్గ సభ్యులు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు బి. నరేష్, టి. జానకిరాములు, కర్రోళ్ల వెంకటస్వామీ ప్రకటించారు.

వైభవంగా సామూహిక షష్టిపూర్తి మహోత్సవం

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి: ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరి క్షేత్రంలో సామూహిక షష్టి పూర్తి మహోత్సవం వైభవంగా ఆదివారం నిర్వహించార. స్వర్ణగిరి దేవస్థానం, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి సంయుక్త నిర్వహణలో, స్వర్ణగిరి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్తలు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 400 దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అర్చకులు ముందుగా విష్వక్సేనారాధన పుణ్యహవచనం నిర్వహించారు. అనంతరం కలశ పూజలు శాంతి పూజలు ఆయుష్య హోమం నిర్వహించారు. అనంతరం మాంగళ్య ధారణ చేసుకున్న దంపతులకు కుంభజల ప్రోక్షణ చేసారు. కార్యక్రమంలో పాల్గొన్న దంపతులకు వారి కుటుంబ సభ్యులకు భోజనం, దర్శనం ఏర్పాటు చేశారు

అండర్-10 చెస్ పోటీల్లో ట్రోఫీ గెలుచుకున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థి

ముద్ర, తుర్కపల్లి : యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం, చిన్న లక్ష్మాపురం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న బొల్లు పవన్ యాదవ్ చెస్ క్రీడలో అద్భుత ప్రతిభను చాటుకున్నారు. ఆదివారం నాడు శ్లోకా ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా నైట్ చెస్ అకాడమీ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీల్లో పవన్ పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో అండర్–10 విభాగంలో టాప్–10 లో స్థానం సంపాదించి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా చిన్న లక్ష్మాపురం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, గ్రామస్తులు విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి గ్రామానికి, పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జీనియస్ లో విద్యార్థులచే రైతు మార్కెట్

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :స్థానిక జీనియస్ పాఠశాలలో శనివారం ప్రీ ప్రైమరీ విద్యార్థులచే రైతు మార్కెట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రకరకాల కూరగాయలు ఆకుకూరలు షాపులు ఏర్పాటు చేసి అమ్మకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వి.సుచరిత ఏర్పాటు చేసిన వాటిని సందర్శించి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు రైతులు పండించిన కూరగాయలు రైతు బజార్లో వ్యాపారులకు ఎలా అమ్మాలో, వినియోదారులకు కొనుగోలు ఎలా చేస్తారో అనేది ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పూర్తి అవగాహన కలుగుతుందని అన్నారు. పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం వల్ల విద్యార్థులకు విజ్ఞానంతో పాటు లోకజ్ఞానం పెంపొందుతుందని పాఠశాల యాజమాన్యాన్ని ప్రిన్సిపల్ను ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో జి రవి, ఉపాధ్యాయునీలు, కార్యక్రమం కోఆర్డినేటర్ తులసి, సాయిరాణి, స్వాతి అలివేలు మంగ, అనూష, దీపిక, సంధ్య, మహాలక్ష్మి భానుప్రియ పాల్గొన్నారు.

శ్రీ మత్స్యగిరి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : వలిగొండ మండలం వెంకటాపురం (వేములకొండ) గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న అన్నదాన సత్రం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానానికి వచ్చే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడంలో భాగంగా అన్నదాన సత్రం నిర్మాణం చేపట్టడం సంతోషకరమని అన్నారు. సత్రం నిర్మాణం పూర్తయితే స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన చైర్మన్ తుమ్మల శ్రీనివాస్, పిఏసిఎస్ చైర్మన్ గరిసె రవి, స్థానిక సర్పంచులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని సహదేవ్, సీనియర్ నాయకులు, ఆలయ ఈఓ వెంకటయ్య,ఆలయ అర్చకులు, దేవస్థాన కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 23.11.2026
www.mudranews.in | @mudranews

20 ఏళ్లలో పండ్లు, కూరగాయలు ముఖ్యం



యువకులు చిన్న వయసు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పెంపొందించుకోవాలి. రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయలు, కొవ్వు తక్కువగా ఉండే ప్రోటీన్ పదార్థాలు చేర్చుకోవాలి. ఇవి భవిష్యత్ ఆరోగ్యానికి పునాదిగా నిలుస్తాయి.

బండి సంజయ్ టార్గెట్ నెరవేరుతుందా?

అసలు గురి 2028 ఎన్నికలేనా?

ముద్ర, కరీంనగర్: తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఘట్టానికి కరీంనగర్ గడ్డ సిద్ధమవుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటనను కేవలం ఒక సాధారణ పార్టీ కార్యక్రమంగా కాకుండా రాష్ట్రంలో తమ రాజకీయ సత్తా చాటే వేదికగా మార్చుకోవాలని కాషాయ దళం భావిస్తోంది. ఈ సభకు ఏకంగా లక్ష మందిని సమీకరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ నిర్దేశించుకున్నారు. ఈ భారీ జనసమీకరణ వెనుక పెద్ద వ్యూహమే ఉన్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.నవంబర్ 23న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన నేపథ్యంలో నిర్వహించనున్న భారీ పాదయాత్ర.. బహిరంగ సభను కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, పట్టణాలు, మండలాల నుంచి సుమారు లక్ష మందిని సమీకరించేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. కేవలం ముఖ్య నాయకులు.. కార్యకర్తలకే పరిమితం కాకుండా.. పోలింగ్ బూత్ స్థాయి నుంచి జనసమీకరణ జరగాలని బండి సంజయ్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల నాయకులు, నగర మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు ఇతర కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఎవరి బాధ్యతలను వారికి అప్పగించారు.ఇటీవల హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి



అమిత్ షా పాల్గొన్న 'లోక్‌తంత్ర బచావో.. అరాజకతా హటావో' కార్యక్రమానికి సుమారు లక్ష మంది హాజరై విజయవంతమైనట్లు బీజేపీ నాయకులు భావిస్తున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రతిపక్ష ఇండియా కూటమి చేస్తున్న విమర్శలకు దీటుగా బదులివ్వడం.. రాజ్యాంగ వ్యవస్థలపై జరుగుతున్న దాడులంటూ బీజేపీ ఆరోపిస్తున్న అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఆ సభ ప్రధాన ఉద్దేశంగా నిలిచింది. ఇప్పుడు అదే తరహాలో కరీంనగర్‌లోనూ జనసమీకరణ జరిపితే రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి బలమైన కేడర్ ఉందనే సంకేతాన్ని పంపవచ్చని బండి సంజయ్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.నవంబర్ 23న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ చేరుకోనున్న నితిన్ నబీన్.. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 12 గంటల సమయంలో కరీంనగర్ కలెక్టరేట్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. జాతీయ అధ్యక్షుడి రాక కంటే కూడా ఆయనకు లభించే స్వాగతం.. తరలివచ్చే జనసందోహం, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం ఎలా ఉంటుందనే దానిపై ఆసక్తి నెలకొంది. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు ప్రధానంగా బండి సంజయ్‌పైనే ఉండటంతో లక్ష మందిని సమీకరించడం ఆయనకు ఒక కీలక సవాలుగా మారింది. అనుకున్న స్థాయిలో జనసమీకరణ జరిగితే రాష్ట్ర బీజేపీలో ఆయన రాజకీయ పలుకుబడి మరింత బలపడే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. ఈ కార్యక్రమాన్ని కేవలం జాతీయ అధ్యక్షుడికి స్వాగతం పలికే వేదికగా మాత్రమే చూడకుండా 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పోటీకి సన్నద్ధంగా క్షేత్రస్థాయిలో బలం పెంచుకునే పనిగా బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.నవంబర్ 23న కరీంనగర్ వేదికగా జరగనున్న ఈ సభ రాబోయే ఎన్నికల వ్యూహాలకు ఒక దిక్సూచిగా మారనుందా? లేక బండి సంజయ్ నిర్దేశించుకున్న లక్ష్యం ఏ మేరకు నెరవేరుతుందా? అనేది తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

అమెరికాలో భారతీయ స్టోర్ ఉద్యోగికి ఐసీఈ షాక్

ముద్ర, టెక్సాస్: అమెరికా సంయుక్త రాష్ట్రంలోని టెక్సాస్‌లో చిన్న తప్పిదం చేసిన భారతీయుడు అరెస్ట్ అయ్యి జైలు జీవితం అనుభవించడంతోపాటు ఇప్పుడు ఇమ్మిగ్రేషన్ అధికారుల అదుపులో బందీ అయిపోయాడు.. స్మార్ట్‌ఫోన్ సెట్టింగ్స్ మార్చడానికి కస్టమర్ ఇచ్చిన పాస్‌కోడ్‌ను ఆసరాగా చేసుకుని ఆమె వ్యక్తిగత ఫొటోలపై కన్నేసిన ఒక స్టోర్ ఉద్యోగి చివరకు జైలు శిక్షతో పాటు ఇమ్మిగ్రేషన్ చిక్కుల్లోనూ పడ్డాడు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు అతడిని అదుపులోకి తీసుకోవడం ఈ వ్యవహారంలో కీలక మలుపుగా మారింది.
టెక్సాస్ రాష్ట్రంలోని ఆస్టిన్‌లో ఉన్న క్యాపిటల్ ప్లాజాలోని టోటల్ వైర్‌లెస్ స్టోర్‌లో జూన్ 7, 2026న ఈ ఘటన చోటు చేసుకుంది. ఒక మహిళ తన ఐఫోన్ నెట్‌వర్క్ సెట్టింగ్స్ మార్పించుకునేందుకు స్టోర్‌కు వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న రఘుల్ ఆనందకృష్ణన్‌కు ఫోన్ అప్పగించి.. అవసరమైన సెట్టింగ్స్ మార్చడం కోసం పాస్‌కోడ్ చెప్పారు. అయితే కస్టమర్ ఇచ్చిన నమ్మకాన్ని ఆ ఉద్యోగి దుర్వినియోగం చేశాడని ఆరోపణలు వచ్చాయి. ఫోన్‌లోని నెట్‌వర్క్ సెట్టింగ్స్ సరిచేయడానికి బదులుగా ఆమె వ్యక్తిగత గోప్యతలోకి చొరబడే ప్రయత్నం చేశాడు. ఫోన్‌లోని రెండు వ్యక్తిగత ఫొటోలను తనకు తాను ఎయిర్‌డ్రాప్ ద్వారా



పంపించుకునేందుకు ప్రయత్నించడంతో పాటు అనుమతి లేకుండా ఆమె స్నాప్‌చాట్ ఖాతాలోకి కూడా ప్రవేశించినట్లు సమాచారం. స్టోర్ నుంచి వెళ్లిన తర్వాత తన ఫోన్‌లో జరిగిన ఎయిర్‌డ్రాప్ ప్రయత్నాలను.. స్నాప్‌చాట్ యాక్సెస్‌ను గమనించిన ఆ మహిళ వెంటనే పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ వ్యవహారంపై రఘుల్ మాత్రం తాను కావాలని చేయలేదని.. అనుకోకుండా ఫోన్ గ్యాలరీని ఓపెన్ చేసినప్పుడు ఆ ఫొటోలు కనిపించాయని వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. కానీ ఫొటోలు కనిపించడం వేరు.. వాటిని అనుమతి లేకుండా తనకు తాను బదిలీ చేసుకునేందుకు ప్రయత్నించడం వేరు కావడంతో ఈ వాదన నిలబడలేక పోయింది. ఈ కేసులో రఘుల్ ఆనందకృష్ణన్ తనపై వచ్చిన ఫెలనీ ఇన్వేసివ్ విజువల్ రికార్డింగ్ అభియోగానికి సంబంధించి నేరాన్ని అంగీకరించాడు. అలాగే క్లాస్ బీ మిస్‌డిమీనర్ అభియోగాన్ని కూడా ఎదుర్కొన్నాడు. ఈ కేసులో కోర్టు అతడికి జైలు శిక్ష విధించింది. జైలు శిక్ష ముగిసి నవంబర్ 22న బయటకు వచ్చిన వెంటనే ఐసీఈ అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వీసా అమెరికాలో నివాస హోదాకు సంబంధించిన వివరాలను అధికారులు వెల్లడించలేదు. ఇమ్మిగ్రేషన్ కోర్టులో విచారణ పూర్తయ్యే వరకు అతడు ఐసీఈ కస్టడీలోనే ఉంటాడని అధికారులు స్పష్టం చేశారు. నేటి కాలంలో స్మార్ట్‌ఫోన్ అంటే కేవలం కాల్స్, మెసేజ్‌లకే పరిమితం కాదు. అందులో వ్యక్తిగత ఫొటోలు.. సోషల్ మీడియా ఖాతాలు.. బ్యాంకింగ్ సమాచారం వంటి సున్నితమైన డేటా ఉంటుంది. రిపేర్ లేదా సెట్టింగ్స్ కోసం ఫోన్ ఇచ్చినప్పుడు కస్టమర్లు పాస్‌కోడ్ ఇవ్వాల్సి వస్తుంది. అలాంటి సమయంలో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని.. గోప్యతను ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులతో పాటు భవిష్యత్తుపైనా తీవ్ర ప్రభావం పడుతుందని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది.

డ్రైనేజీలో చిక్కుకున్న వ్యక్తి..

నాలుగు రోజుల తర్వాత సురక్షితంగా బయటకు



ముద్ర, గౌహతి: గువాహటిలోని అత్యంత రద్దీగా ఉండే రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీలో నాలుగు రోజుల పాటు చిక్కుకుపోయిన ఓ వ్యక్తిని స్థానికులు ప్రాణాలతో రక్షించారు. నగర నడిబొడ్డున ఉన్న గువాహటి రైల్వే స్టేషన్ సమీపంలో, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) భవనానికి సరిగ్గా ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్ కింది నుంచి చిన్నగా ఆర్తనాదాలు వినిపించడంతో అటువైపుగా వెళ్తున్న బాటసారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.మొదట ఆ శబ్దాలు ఎక్కడి నుంచి వస్తున్నాయో అర్థం కాక చుట్టుపక్కల వెతికిన స్థానికులకు, డ్రైనేజీ లోపలి నుంచి ఒక వ్యక్తి సహాయం కోసం అరుస్తున్నట్లు తెలిసింది. వెంటనే అక్కడ పెద్ద ఎత్తున జనం గుమిగూడారు. స్థానిక యువకులు, ప్రజలు కలిసి ఎంతో శ్రమించి డ్రైనేజీ మూతను తొలగించి, లోపల చిక్కుకుపోయిన వ్యక్తిని సురక్షితంగా బయటకు లాగారు. బయటకు తీసినప్పుడు అతను తీవ్రంగా నీరసించిపోయి కనిపించాడని, దాదాపు నాలుగు రోజులుగా ఆహారం, నీరు లేకుండా ఆ చీకటి డ్రైనేజీలోనే ఉండిపోయినట్లు స్పష్టమైందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.కాగా, రక్షించబడిన బాధితుడి పేరు, ఇతర వివరాలు ఇంకా తెలియరాలేదు. అతను ఆ డ్రైనేజీలోకి ప్రమాదవశాత్తూ జారిపడ్డాడా లేక మరేదైనా కారణంతో అందులోకి వెళ్లాడా, అసలు ఏ పరిస్థితుల్లో అందులో చిక్కుకుపోయాడు అనే విషయాలపై ఇంకా స్పష్టత రాలేదని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. నిత్యం వేలాది మంది ప్రజలు, వాహనాల రాకపోకలతో అత్యంత రద్దీగా ఉండే నగర ప్రధాన ప్రాంతంలో నాలుగు రోజుల పాటు ఎవరి కంటా పడకుండా అతను డ్రైనేజీలో ఎలా ఉండిపోయాడనే అంశం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం బాధితుడి గుర్తింపును నిర్ధారించేందుకు, ఈ ఘటన వెనుక ఉన్న పూర్తి పరిస్థితులను తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

సీఎం రేవంత్ కాన్వాయ్‌కు తప్పిన ప్రమాదం..

చదర్‌ఘాట్ బ్రిడ్జి వద్ద అడ్డుపడ్డ ఎద్దు



ముద్ర, హైదరాబాద్: హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాన్వాయ్‌కు పెను ప్రమాదం తప్పింది. గాంధీ భవన్ నుంచి హైదరాబాద్ రేస్ కోర్స్‌లో జరిగే చీఫ్ మినిస్టర్ ట్రోఫీ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం బయలుదేరారు. మార్గమధ్యంలో కాన్వాయ్ చదర్‌ఘాట్ చిన్న బ్రిడ్జి వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా ఓ ఎద్దు ఎదురుగా అడ్డుపడింది.కాన్వాయ్ సిబ్బంది అప్రమత్తత.. బ్రేకులతో ముందుకుఎదురుగా ఎద్దు రావడాన్ని గమనించిన సీఎం రేవంత్ రెడ్డి కాన్వాయ్ సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. క్షణాల్లో బ్రేకులు వేసి వాహనాలను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ తర్వాత పరిస్థితిని అదుపులోకి తీసుకుని కాన్వాయ్ నెమ్మదిగా ముందుకు సాగింది. ఈ ఘటనతో అక్కడున్న మలక్‌పేట ట్రాఫిక్ కానిస్టేబుళ్లు వెంటనే స్పందించారు. కాన్వాయ్‌కు ఎదురుగా వెళ్లిన ఎద్దును అప్రమత్తంగా పక్కకు లాగి పక్కకు తప్పించారు. సిబ్బంది, ట్రాఫిక్ పోలీసుల సమయస్ఫూర్తితో ఎలాంటి ఇబ్బంది లేకుండా సీఎం కాన్వాయ్ ముందుకు కదిలింది.

పిలవని పేరంటానికి వెళ్తున్నారా? జాగ్రత్త

పెళ్లి భోజనం మాట అటుంచితే రూ.5 వేల జరిమానా


ముద్ర, హన్మకొండ: పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే చాలు.. మన ఊరి కళ్యాణ మండపాల దగ్గర ఒక కొత్త రకం ఆధ్యాత్మిక.. సారీ భోజనప్రియ కళ కనిపిస్తుంది. పెళ్లికి వెళ్లాలంటే ఆహ్వాన పత్రిక ఉండాలట.. ఎవరికి కావాలి ఆ కాగితం ముక్క? మనకు కావాల్సింది కమ్మని విందు.. ఘుమఘుమలాడే చికెన్ బిర్యానీ.. పక్కనే మటన్ ముక్క.. చివర్లో డబుల్ కా మీఠా.. కానీ ఇప్పుడు హనుమకొండలోని కొన్ని ఫంక్షన్ హాళ్ల బోర్డులు చూస్తుంటే పెళ్లి భోజనం తినాలంటే ముందు మన అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది."ఎక్కడ పెళ్లి జరుగుతోంది? మెనూలో ఏమేం ఉన్నాయి?" అంటూ ఫుడ్ రాడార్ వేసుకుని తిరిగే అన్‌ఇన్వైటెడ్ ఫుడీస్ కు హనుమకొండలో గట్టి షాకే తగిలింది. ఫంక్షన్‌తో సంబంధం లేకుండా లోపలికి ప్రవేశిస్తే సెక్షన్ 441 ప్రకారం మూడు నెలల జైలు శిక్ష రూ.5 వేల జరిమానా తప్పదంటూ హెచ్చరిక బోర్డులు వెలిశాయి.ఒకప్పుడు పెళ్లిలో ఎవరైనా మీరు ఎవరి వైపు? అని అడిగితే కనురెప్ప కూడా ఆర్పకుండా పెళ్లికొడుకు రూమ్‌మేట్ ఫ్రెండ్‌కి క్లోజ్ అనో.. పెళ్లికూతురు పిన్ని వాళ్ల పక్కింటి చుట్టం అనో ఏదో ఒక సినిమాటిక్ డైలాగ్ కొట్టి ప్లేట్ పట్టుకునేవారు. కానీ ఇప్పుడు ఆ డైలాగ్‌లు చెల్లేలా లేవు. బహుశా త్వరలో గేటు దగ్గర ఆధార్ కార్డు.. ఫ్యామిలీ ట్రీ సర్టిఫికెట్.. కనీసం ఒక సెల్ఫీ అయినా అడుగుతారేమోనని నెటిజన్లు సరదాగా కామెంట్లు చేస్తున్నారు.నిజానికి ఈ కఠిన బోర్డుల వెనుక ఫంక్షన్ హాళ్ల యజమానుల కన్నీళ్లు.. బడ్జెట్ లెక్కలు దాగి ఉన్నాయి. ఒక్కో ప్లేట్ భోజనానికి వందల రూపాయలు ఖర్చవుతుంటే పిలవని అతిథులు వచ్చి లెక్కలు తారుమారు చేస్తుండటంతో నిర్వాహకులకు తలనొప్పి మొదలైంది. దాంతో సెక్యూరిటీ చెకింగ్‌లు.. ఆహ్వాన పత్రికల తనిఖీలు పెరుగుతున్నాయి.రేపు పొద్దున్న పెళ్లికి వెళ్లాలంటే ఇన్విటేషన్ కార్డే పాస్‌పోర్ట్ కావచ్చేమో.. లోపలికి వెళ్లాక భోజన కూపన్.. స్వీట్ కౌంటర్ దగ్గర స్పెషల్ స్కానర్.. బిర్యానీలో పీస్ ఎక్కువ వేయించుకుంటే అదనపు చార్జీ..ఇలాంటి సీన్లు ఊహించుకుంటేనే భోజన ప్రియులకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.అయితే ఇక్కడ ఒక చిన్న లాజిక్ కూడా గుర్తుంచుకోవాలి. ఆహ్వానం లేకుండా ఇతరుల వేడుకల్లోకి దూరడం కచ్చితంగా తప్పే.. నిర్వాహకులు తమ భద్రత.. నిర్వహణ కోసం నిబంధనలు పెట్టుకోవచ్చు. కానీ బోర్డుపై రాసినంత మాత్రాన ప్రతి చిన్న విషయానికీ ఆటోమేటిక్‌గా శిక్ష, జరిమానా పడిపోతాయని అనుకోకూడదు. ఏదైనా చట్టపరమైన చర్య అనేది పరిస్థితులు.. నేరం తీవ్రత.. చట్ట ప్రక్రియ ఆధారంగానే ఉంటుంది.ఈ సీజన్‌లో పిలవని పేరంటానికి వెళ్లే ప్లాన్‌లో ఉంటే ఒక్కసారి ఆలోచించుకోండి. ఫ్రీ బిర్యానీ ఆశించి వెళ్లి చివరికి రూ.5 వేల జరిమానా కట్టాల్సి వస్తే ఆ బిర్యానీ చరిత్రలో అత్యంత ఖరీదైన బిర్యానీగా మిగిలిపోతుంది.



ఇమ్మిగ్రేషన్ అధికారుల దుర్మార్గం..

ఫ్లైట్ ఎక్కుతుండగా లాక్కెళ్లారు.. కూతురి ఆర్తనాదాలు వైరల్

ముద్ర, న్యూయార్క్: ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణానికి సిద్ధమైన ఆ తల్లికి.. విమానాశ్రయంలో ఊహించని చేదు అనుభవం ఎదురైంది. మరికొద్ది నిమిషాల్లో విమానం ఎక్కి గమ్యస్థానానికి చేరుకుంటామనుకున్న సమయంలో ఇమ్మిగ్రేషన్



అధికారులు చేసిన హఠాత్తు చర్య ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. కళ్ల ముందే తన కుమార్తెను అధికారులు బలవంతంగా లాక్కెళ్తుంటే ఆ తల్లి పెట్టిన ఆర్తనాదాలు చూసిన ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచివేస్తున్నాయి. అమెరికాలోని సియాటెల్-టకోమా అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అందరినీ కలిచివేస్తోంది. థ్యాంక్స్‌గివింగ్ సెలవుల నేపథ్యంలో ప్రయాణికులతో కిక్కిరిసిపోయిన సియాటెల్ విమానాశ్రయంలో శనివారం ఉదయం ఈ హృదయ విదారక ఘటన జరిగింది. లాస్‌ఏంజెలెస్‌కు వెళ్లాల్సిన అలాస్కా ఎయిర్‌లైన్స్ విమానం ఎక్కేందుకు ప్రయాణికులు జెట్ బ్రిడ్జిపై వేచి ఉన్నారు. అంతా ప్రశాంతంగా సాగుతున్న వేళ ముసుగులు ధరించి ఎలాంటి గుర్తింపు చిహ్నాలు లేని సాధారణ దుస్తుల్లో ఉన్న అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు అక్కడికి దూసుకొచ్చారు.ప్రయాణికులందరూ చూస్తుండగానే ఓ వ్యక్తిని బలవంతంగా నేలపైకి తోసి ఈడ్చుకెళ్లడం అక్కడున్న వారిని భయాందోళనకు గురిచేసింది. ఆ సమయంలో తన కుమార్తెను కూడా అధికారులు అదుపులోకి తీసుకోవడంతో ఆ తల్లి తల్లడిల్లిపోయింది. "నా కూతురిని వదిలేయండి.. ఆమెకు చెల్లుబాటయ్యే వర్క్ పర్మిట్ ఉంది" అంటూ ఆ తల్లి చేసిన ఆర్తనాదాలు విమానాశ్రయంలో ప్రతిధ్వనించాయి. కళ్ల ముందే కన్నబిడ్డను లాక్కెళ్తుంటే ఆపలేక ఆ తల్లి పడిన ఆవేదనను చూసి తోటి ప్రయాణికులు.. విమాన సిబ్బంది సైతం చలించిపోయారు. ఈ దృశ్యాలను కొందరు ప్రయాణికులు మొబైల్ ఫోన్లలో బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో క్షణాల్లోనే ఈ వీడియో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ఐసీఈ అధికారులు స్పందించారు. మెక్సికోకు చెందిన రికార్డో లరాండో మెన్డోజా, సోఫియా హెర్నాండెజ్ మెజియా అనే ఇద్దరి వీసా గడువు ముగిసినప్పటికీ వారు చట్టవిరుద్ధంగా అమెరికాలోనే ఉంటున్నారని తెలిపారు. అందుకే వారిని అదుపులోకి తీసుకున్నామని వివరణ ఇచ్చారు. అంతేకాకుండా అరెస్టు సమయంలో సోఫియా తమ అధికారులపై వేడి కాఫీ విసిరారని.. ఫెడరల్ అధికారిపై దాడి చేసినందుకు ఆమెపై కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. మరోవైపు విమాన బోర్డింగ్ సమయంలో తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అధికారులు ఇలా వ్యవహరించడంపై అలాస్కా ఎయిర్‌లైన్స్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సెలవుల రద్దీ సమయంలో ఈ ఘటన ప్రయాణికులను.. తమ సిబ్బందిని తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేసిందని పేర్కొంది. పోర్ట్ ఆఫ్ సియాటెల్ అధికారులు సైతం బాధిత కుటుంబానికి.. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యంపై విచారం వ్యక్తం చేస్తూ ఈ విషయంపై ఫెడరల్ అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. దేశ భద్రత, ఇమ్మిగ్రేషన్ చట్టాలను అమలు చేయడం అధికారుల బాధ్యతే కావచ్చు. కానీ ఆ చట్టాలను అమలు చేసే తీరులో కనీస మానవీయత లేకపోవడం ఇప్పుడు పలు ప్రశ్నలకు తావిస్తోంది. పదుల సంఖ్యలో ప్రయాణికుల మధ్య కుటుంబ సభ్యుల కళ్ల ముందే నేరస్థుల్లా ఈడ్చుకెళ్లడం ఎంతవరకు సమంజసం? చట్టం తన పని తాను చేసుకుపోయినా.. మనుషుల భావోద్వేగాలను గౌరవించేలా అధికారుల తీరు ఉండాలని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఆ తల్లి ఆర్తనాదాలు అమెరికా ఇమ్మిగ్రేషన్ వ్యవస్థలోని కఠినత్వానికి నిదర్శనంగా నిలిచాయి.



ఉగ్రవాదం, సింధు జలాలపై పాక్ మంత్రి దాటవేత

ముద్ర, న్యూఢిల్లీ: షాంఘై సహకార సంస్థ (SCO) చర్చల్లో పాల్గొనేందుకు పాకిస్తాన్ మంత్రి ముసాదిక్ మసూద్ మాలిక్ భారత్‌కు వచ్చారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా ఒక పాకిస్తాన్ మంత్రి భారత్ రావడం ఇదే తొలిసారి. ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో మాలిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపడానికి తమకు ఎలాంటి ఆహ్వానం అందలేదని ఆయన తెలిపారు.ఉగ్రవాదం, సింధు జలాల ఒప్పందం వంటి కీలక అంశాలపై ప్రశ్నలు ఎదురవగా.. అధికారికంగా చర్చలకు ఆహ్వానిస్తేనే సమాధానాలు చెబుతానంటూ స్పందించారు.ఎస్‌సీఓ సమావేశాల్లో జరిగిన సందేశాన్ని పాకిస్తాన్ తీసుకెళ్లడమే తన పర్యటన ఉద్దేశమని చెప్పారు. భారత్-పాకిస్తాన్ మధ్య ఉగ్రవాద సమస్యపై అడిగిన ప్రశ్నలకు మాలిక్ స్పందిసతూ.. ఈ సమస్యపై ఆధారాలతో ఏర్పాటు చేసిన అధికారిక చర్చల వ్యవస్థ ద్వారా చర్చించుకోవచ్చని అన్నారు. ఉగ్రవాదం కారణంగా అనేక దేశాలు నష్టపోయాయని, పాకిస్తాన్ కూడా ఎంతో మంది ప్రజలను కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే రెండు దేశాలు కలిసి చర్చించాలని సూచించారు.సింధు జలాల ఒప్పందంపై గతంలో ఆయన చేసిన వ్యాఖ్యల్ని మీడియా ప్రశ్నించింది. దీనిపై స్పందించిన మాలిక్.. ఆ ఒప్పందంపై చర్చించడానికి కూడా భారత్ నుంచి తనకు ఎలాంటి ఆహ్వానం రాలేదని చెప్పారు. సింధు జలాల ఒప్పందంపై చర్చించడానికి పిలిస్తే తప్పకుండా వస్తానని, కానీ ఇప్పటి వరకు తనను ఆహ్వానించలేదని అన్నారు. తాను కేవలం ఎస్‌సీఓ సమ్మిట్ కోసమే భారత్ వచ్చానని మరోసారి స్పష్టం చేశారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555